ప్రజాశక్తి

శుక్రవారం 14 జులై 2023

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

విశాఖ.. రాజకీయ కాక

◆ పంచకర్ల రాజీనామా వైసిపి ఊహించిందేనా..

◆ ఇంకా పలువురు నేతలు క్యూ కడుతున్నారా ? ◆ అధికార పార్టీకి అధ్యక్షుల కొరత !

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ జిల్లా వైసిపిలో పంచకర్ల వేరు కుంపటితో రాజకీయ కాక మొదలైంది. అయితే రాజకీయ పార్టీల్లో నాయకులు అటూ ఇటూ మారడం సర్వసాధారణమే. రాష్ట్రంలో అధికారంలో ఉన్న పార్టీకి అధ్యక్షుడు కరువయ్యే పరిస్థితి విశాఖ జిల్లాలోనే కనిపిస్తోంది. అధికారం ఉంటేనే ఏ పదవికైనా అలంకారం. అది లేనప్పుడు ఎంతటి బాధ్యత చేతిలో ఉంటే ఏమిటి ? అన్నది ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. వైసిపి విశాఖ జిల్లా అధ్యక్ష పీఠానికి ఆరు నెలల క్రితం అధ్యక్షునిగా ఎన్నికైన పంచకర్ల రమేష్‌బాబు తాజాగా రాజీనామా చేయడంతో ఆ పార్టీ విశాఖ జిల్లా నేతల్లో కలకలం మొదలైంది. అధ్యక్షుడు పార్టీ పదవికి, సభ్యత్వానికి ఒకేసారి రాజీనామా చేశాడంటే ఏదో ఒకటి ఆశించి జరిగి ఉండొచ్చన్నది ఇట్టే చెప్పొచ్చు. లేదంటే వేరే పార్టీ నుంచి టికెట్ ఆఫర్ వచ్చి ఉంటుందన్నది ఊహించదగినదే.



రాజీనామా పత్రాన్ని చూపుతున్న పంచకర్ల రమేష్ బాబు

పంచకర్ల రమేష్‌బాబు వ్యవహారంలో బహుశా పై రెండింటిలో రెండూ లేదంటే ఏదో ఒకటి అయి ఉంటుందంటూ పార్టీ శ్రేణులు సర్దుకుంటున్నాయి. వాస్తవానికి పార్టీ అధ్యక్ష బాధ్యత నుంచి ఏనాడైనా పంచకర్ల తప్పుకునే అవకాశాలున్నాయన్న చర్చ కొంతకాలంగా నడుస్తూ వస్తోంది.

అసలేం జరిగింది?

పంచకర్ల రమేష్ బాబు గతంలో ప్రజారాజ్యం, కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీల్లో క్రియాశీలకంగానే వ్యవహరించారు. ఎంఎల్‌ఎగా గెలిచారు. సీనియర్ రాజనీయ నేతగా పంచకర్లకు గుర్తింపు ఉంది. వైసిపి 2019లో పెద్ద ఊపుతో రాష్ట్రంలో అత్యధిక స్థానాల్లో గెలిచి అధికారం చేజిక్కించుకున్న పరిస్థితుల్లో ఆయన ఆ పార్టీలో చేరారు. అనంతరకాలంలో పార్టీ పగ్గాలను అధిష్టానం అప్పగించింది. అప్పటికే పార్టీ అధ్యక్ష పదవిలో ఉన్న మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావును ఆ బాధ్యతల నుంచి అధిష్టానం తప్పించి పంచకర్లకు పట్టం కట్టింది. అప్పట్లోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నుంచి పంచకర్లకు భరోసా దొరికింది. పెందుర్తి, యలమంచిలి అసెంబ్లీ సెగ్మెంట్ల నుంచి 2024 ఎన్నికల్లో పోటీకి తాను సిద్ధమన్న ఆసక్తిని పంచకర్ల వ్యక్తం చేయడంతో హామీ కూడా లభించినట్లు భోగట్టా. ఈ క్రమంలోనే ఆయన వైసిపి జిల్లా అధ్యక్షునిగా కొనసాగుతున్నారు. క్రియాశీలకంగా కార్యక్రమాలేవీ పెద్దగా మిగతా 2లో..

జిఒ 301, 388 భూములకు

కన్వేయన్స్ డీడ్ అమలు

◆ నేటి నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం

◆ 100 గజాల వరకూ ఉచిత రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జిఒ నెంబరు 301, 388ల ద్వారా క్రమబద్ధీకరణ పట్టాలు పొందిన భూములకు కన్వేయన్స్ డీడ్ ప్రక్రియ ప్రారంభంకానున్నట్టు విశాఖ జిల్లా జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ తెలియజేశారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిఒ నెంబరు 301, 388 ద్వారా అర్హులైన లబ్ధిదారులకు కన్వేయన్స్ డీడ్ ప్రక్రియపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో బిపిఎల్, ఎపిఎల్ కుటుంబాలకు నివాస గృహాల ద్వారా ప్రభుత్వ భూములలో అభ్యంతరం లేని ఆక్రమణలను క్రమబద్ధీకరించడానికి, అర్హులైన లబ్ధిదారులకు ఉచితంగా, మార్కెట్ విలువ చెల్లింపుపై క్రమబద్ధీకరణ పట్టాలను గతంలో జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. జిల్లాలో జిఒ ఎంఎస్ నెంబర్ 388 కింద 8401 దరఖాస్తుల్లో 5890 కేసులకు క్రమబద్ధీకరణ పూర్తయిందని, 5890 కన్వేయన్స్ డీడ్‌లలో 3435 కేసులు 100 చదరపు గజాల కంటే తక్కువ విస్తీర్ణంలో ఉన్నాయని, వీటికి లబ్ధిదారులు రిజిస్ట్రేషన్ ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదని అన్నారు. కేవలం వినియోగదారు రుసుము రూ.500 చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. వంద చదరపు గజాలపైనున్న 2455 లబ్ధిదారులు గతంలో చెల్లించిన క్రమబద్ధీకరణ ఖర్చుపై 7.5 శాతం రిజిస్ట్రేషన్ ఛార్జీలు చెల్లించాలని చెప్పారు. ఈ నెల 14 నుంచి టైమ్‌లైన్ షెడ్యూల్ ప్రకారం వార్డులలో లబ్ధిదారులకు అనుకూలంగా కన్వేయన్స్ డీడ్ అమలు చేస్తామన్నారు.

అదే విధంగా జిఒ నెంబర్ 301 ద్వారా 7441 దరఖాస్తులు అందాయని, వీటిలో 7228 మంది కేసులకు పూర్తిగా క్రమబద్ధీకరణ మొత్తం చెల్లించామని పేర్కొన్నారు. వీరందరికీ ఈ నెల 14 నుంచి కన్వేయన్స్ డీడ్ అమలు చేస్తామని అన్నారు. సంబంధిత మండల తహశీల్దార్లు కన్వేయన్స్ డీడ్‌లు అమలు చేస్తారని తెలిపారు.

ఈ క్రమబద్ధీకరణ ద్వారా పొందిన టైటిల్ డీడ్ పట్టాలు పూర్తి అనుభవంతో రిజిస్ట్రేషన్ హక్కులు కలిగి ఉంటాయని అన్నారు. పూర్తి హక్కులతో అమ్మకం, తనఖా చేయవచ్చన్నారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎస్.శ్రీనివాస్‌మూర్తి, ఈ - సెక్షన్ సూపరింటెండెంట్ రామారావు పాల్గొన్నారు.

సరియా జలపాతం వద్ద పెద్దపులి అడుగుజాడలు

▸ వార్త 7లో..

దొడ్డిదారి బదిలీలు రద్దు చేయాలని ధర్నాలు

▸ వార్తలు లోపలి పేజీల్లో..

వేతనాల్లో కోతపై కాంట్రాక్టు కార్మికుల ఆగ్రహం

▸ వార్త 4లో..



దీక్షల్లో కూర్చున్న హెచ్‌పిసిఎల్ కాంట్రాక్టు కార్మికులు

స్టీల్‌ప్లాంట్ రక్షణకు ఐక్య పోరాటం

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని కోరుతూ నిర్వహిస్తున్న పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని, అన్ని కార్మిక, ప్రజా సంఘాలను ఐక్యం చేసి ఉమ్మడిగా ఉద్యమం చేపడతామని హెచ్‌పిసిఎల్ మల్కాపురం జోన్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఉపాధ్యక్షులు ఎస్.వాసు అన్నారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలేదీక్షలు గురువారానికి 833వ రోజుకు చేరాయి. దీక్షల్లో హెచ్‌పిసిఎల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరిగితే తలెత్తే నష్టంపై ముమ్మందు మిగతా 2లో..

అమ్మ ఒడి చేరేనా..!

◆ డబ్బులు జమకాని తల్లులు ఎదురుచూపు

◆ 50 వేల మందికిపైగా ఆందోళన



ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అమ్మఒడి పథకం కింద బ్యాంకు ఖాతాలో డబ్బులు జమకాని తల్లులు జిల్లాలోని బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారు. డబ్బులు ఎప్పుడు జమవుతాయో తెలీని వారంతా తమ పరిధిలోని వాలంటీర్ల దగ్గరకు వెళ్తున్నారు. డబ్బులు జమచేసే గడువు సమీపించడంతో పడతాయో, లేదోనని ఆందోళనకు గురవుతున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గత నెల 28న బటన్ నొక్కినప్పటి నుంచి తల్లులు 'అమ్మఒడి' కోసం ఆశతో ఎదురుచూస్తున్నారు. డబ్బులు జమైతై ప్రయివేటు స్కూళ్లలో చదువుతున్న పిల్లలకు ఫీజులు కడతామనుకున్నారు.. కానీ గురువారం నాటికి జిల్లాలో 50 వేల మందికిపైగా తల్లుల ఖాతాలో డబ్బులు జమకాలేదు. జిల్లాలో అమ్మఒడి నాలుగో ఏడాదిలో 1,50,870 మంది విద్యార్థులకు రూ.226.30 కోట్లు మంజూరైంది. గురువారం నాటికి 90 వేల మంది తల్లుల ఖాతాల్లో డబ్బులు జమకాలేదని సమాచారం. అమ్మఒడి కింద తల్లుల ఖాతాల్లో వేయాల్సిన రూ.15 వేలకుగానూ పాఠశాల నిర్వహణకు రెండు వేల రూపాయలు కోత విధించి రూ.13 వేలను ప్రభుత్వం చెల్లిస్తోంది. ఆ సొమ్ము 16లోగా జమకాకపోతే ఇక రాదన్న ఆందోళన ఎక్కువ మందిలో వ్యక్తమవుతోంది.

అనకాపల్లి మండలం తుమ్మపాల జిల్లా పరిషత్ పాఠశాలలో 583 మంది విద్యార్థులకుగానూ 22 మందికి మినహా మిగిలిన వారి తల్లుల ఖాతాలో రూ.13 వేలు చొప్పున జమైంది. కశింకోట మండలం బంగారయ్యపేట ప్రాథమిక పాఠశాలలోని 29 మంది విద్యార్థులకు ఏడుగురు తల్లుల ఖాతాలో డబ్బులు జమయ్యాయి. తరగతి మినహా విద్యార్థుల డేటాలో మార్పులేనప్పటికీ సాంకేతిక సమస్యలు వల్ల డబ్బులు పడలేదని వాలంటీర్లు చెబుతుండడంతో తల్లులు కలవరపాటుకు గురవుతున్నారు. అమ్మఒడి డబ్బులు జమ సమాచారం సంబంధిత జిల్లా అధికారుల వద్ద లేకపోవడం గమనార్హం

మొదటి పేజీ తరువాయి..

విశాఖ.. రాజకీయ కాక

నిర్వహించకపోయినా ప్రెస్‌మీట్లకే పరిమితం అయ్యారన్నది ఆ పార్టీ శ్రేణుల నుంచి వినిపిస్తోంది. మరోపక్క అధిష్టానాన్ని కలిసి నియోజకవర్గాల్లో దిగువ శ్రేణి నాయకుల సమస్యలు చెప్పాలనుకున్నా పెద్ద నాయకులు ఆ అవకాశం ఇవ్వలేదంటూ గురువారం విశాఖ నగరంలోని మేఘాలయా హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో స్వయంగా పంచకర్ల వెల్లడించడం విశేషం.

వైవి ప్రకటనలతో భవిష్యత్‌కు భరోసాపై పంచకర్ల మథనం

ఇటీవలే వైసిపి అగ్రనేత వైవి.సుబ్బారెడ్డి పెందుర్తి సభలో స్థానిక ఎంఎల్‌ఎ ఆదీప్‌రాజును చూపిస్తూ 'ఈయన్ను మీరే ఎంఎల్‌ఎగా అత్యధిక మెజారిటీతో మళ్లీ గెలిపించుకోవాలి' అంటూ సభా వేదికగా వెల్లడించారు. భీమిలిలో జరిగిన సభలో స్థానిక ఎంఎల్‌ఎ ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు సంబంధించి కూడా ప్రజలనుద్దేశించి ఇలాంటి ప్రకటన చేశారు. ముఖ్యంగా పెందుర్తి టికెట్ ఆశిస్తున్న పంచకర్ల.. అదీప్‌రాజ్‌కు అనుకూలంగా చేసిన ప్రకటనను జీర్ణించుకోలేకపోవడం కనిపిస్తోంది. ఎందుకంటే గడచిన మూడేళ్లలో ఆదీప్‌రాజు పట్ల నియోజకవర్గ ప్రజల్లో అసంతృప్తి, వ్యతిరేకత వ్యక్తం కావడంతో, పలు సర్వేలు కూడా ఇదే తెలియజేయడంతో తనకు టికెట్ గ్యారెంటీ అని పంచకర్ల ఊహించారు. కానీ త్రాసు తిరగబడింది. వైసిపికి చెందిన ఓ నాయకుడు మాట్లాడుతూ 'పంచకర్లకు బాధ్యతలు అప్పగించినప్పుడే ఏదో ఒక నాడు బయటకు వెళతారు' అని అంచనా వేశామంటూ ఈ సందర్భంగా వెల్లడించారు.

ఇంకా క్యూ కడుతున్నారా ?

కొంతమంది సీనియర్ రాజకీయ నాయకులు, మాజీ ఎంఎల్‌ఎలు వైసిపి నుంచి పార్టీలు మారేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆ పార్టీలోనే గుసగుసలు మొదలయ్యాయి. ప్రోటోకాల్ ఉన్న పంచకర్ల తొలుత బయటపడ్డారని, ఏ బాధ్యతలూ, పదవులూ లేని ఇంకొంతమంది ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ బయటకొచ్చే అవకాశాలున్నాయని ఆ పార్టీ శ్రేణుల నుంచే వినిపిస్తోంది. వీరిలో కొద్దిమంది ఎంఎల్‌ఎలు కూడా ఉండే అవకాశం ఉందన్నది భోగట్టా ! జనసేన నుంచి పెందుర్తి టికెట్ పంచకర్లకే ఆఫర్ ఉందన్న చర్చ కూడా విశాఖ రాజకీయ వర్గాల్లో నడుస్తోంది. మరో మూడు నాలుగు రోజుల్లో తన భవిష్యత్ ప్రయాణం ఏమిటన్నది పంచకర్లే స్వయంగా ప్రకటించే అవకాశాలున్నాయి.

స్టీల్‌ప్లాంట్ రక్షణకు ఐక్య పోరాటం

విస్తృత స్థాయిలో ప్రచారం చేస్తామన్నారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం దిగొచ్చే వరకూ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. దీక్షల్లో కూర్చున్న వారిలో జి.గణేష్, ఎస్.ఏసుబాబు, ఎస్.నాగేశ్వరరావు ఉన్నారు.

రక్షణ రంగంలో పనిచేసేందుకు అవకాశాలు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : రక్షణ రంగంతో కలిసి పని చేయడానికి పరిశ్రమలకు అనేక అవకాశాలను కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోందని రక్షణరంగ పరిశోధనా అభివృద్ధి సంస్థ మాజీ కార్యదర్శి డాక్టర్ జి.సతీష్ రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ), సొసైటీ ఆఫ్ ఇండియన్ డిఫెన్స్ మాన్యుఫ్యాక్చరర్స్ (ఎస్ఐడిఎం)ల ఆధ్వర్యంలో బీచ్ రోడ్‌లోని నోవాటెల్ హోటల్లో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం నుంచి ఇతర ప్రాంతాలకు ఎగుమతులు ఎలా పెరిగాయో వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఇండస్ట్రియల్ లైసెన్సింగ్‌ను సరళతరం, ఎగుమతుల క్లియరెన్స్‌ను సులభతరం చేసిందని అన్నారు.

'నా భార్యను విడిపించరూ..'

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

స్వయంగా సొంత బావ చేసిన ఘాతుకం ఇది. మాటల కందని క్రౌర్యం. తన భార్యను ఏడాదిగా తన వద్దనే ఉంచుకుంటూ 'నీ దిక్కున్నచోట చెప్పుకో... అధికార పార్టీ నాయకులంతా నాకు తెలుసు...పోలీసులు సైతం ఏమీ పీకలేరు' అంటూ అధికార పార్టీకి చెందిన ఓ ప్రబుద్ధుడి వ్యవహారం ఇది. సొంత బామ్మరిది భార్యను ఏడాది కాలంగా అపహరించుకుని పోవడమేగాక తిరిగి బెదిరింపులకు దిగుతున్నాడంటూ తననూ, తన ఇద్దరు పిల్లలనూ, తల్లినీ సదరు వ్యక్తి వేధిస్తున్న వైనంపై ఓ గిరిజనుడు కుటుంబంతో కలిసి వచ్చి విశాఖపట్నం రేంజ్ డిఐజిని గురువారం కలిసి తమ గోడు వెళ్లదీసుకున్నారు.

వివరాల్లోకి వెళితే..

అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగుడ మండలం గుంటసీమ గ్రామానికి చెందిన ఆర్జి ప్రకాష్‌రావు తన ఇద్దరు పిల్లలు, తల్లితో కలసి గురువారం విశాఖ రేంజ్ డిఐజిని కలిసి తన బావ చేసిన ఘాతుకంపై చర్య తీసుకుని అతని చెరలో ఏడాది కాలంగా ఉన్న తన భార్యను విడిపించి పిల్లలకు, తనకు న్యాయం చేయాలని అర్థించాడు. తన భార్య అనూష్‌కుమారి డుంబ్రిగుడ మండలం కూంద్రూం పంచాయతీ సరాయి గ్రామానికి చెందిన వారని, పదేళ్ల క్రితం ఆమెను వివాహం చేసుకున్నానని ప్రకాష్‌రావు పేర్కొన్నారు. ఇద్దరు పిల్లలతో సంతోషంగా జీవనం సాగిస్తున్న సమయంలో తన భార్య తల్లిదండ్రులు ఏడాది క్రితం ఇంటికొచ్చి తనపై దాడిచేసి భార్యను, పిల్లలను, ఇంట్లో విలువైన వస్తువులను తీసుకుని వెళ్లిపోయారని పేర్కొన్నాడు. తర్వాత పిల్లల కోసం తాను వెళ్లగా పిల్లలను తనకు వదిలేసి భార్యను మాత్రం ఎక్కడ పెట్టారో నెలల తరబడి తనకు చెప్పలేదన్నారు. దీంతో తాను మానసికంగా ఆవేదనకు గురై విశాఖలోని మెంటల్ కేర్ ఆసుపత్రిలో నెల రోజులు చికిత్స తీసుకున్నానని ఫిర్యాదులో ప్రకాష్‌రావు వెల్లడించారు. తర్వాత ఆలస్యంగా గ్రామస్తుల ద్వారా అసలు విషయం తెలిసిందన్నారు. సాగర గ్రామంలో తన సొంత బావ కూడా పాపారావు వద్దే భార్య ఉన్నట్టు పలువురు తెలియజేసారన్నారు. ఈ విషయమై డుంబ్రిగుడ పోలీసులను ఆశ్రయించగా వారు స్పందించలేదని, జిల్లా ఎస్పీని కలిసినా లాభం లేకపోయిందని ఈ సందర్భంగా మీడియా వద్ద గురువారం అర్జీదారుడు ఆవేదన చెందాడు.

తాను భార్యకోసం వెతుకుతున్నానని తెలుసుకున్న తన బావ తన కుటుంబాన్ని హతమార్చుతానని ఇతరులతో చెబుతున్నాడని, తమ కుటుంబానికి పాపారావు వల్ల ప్రాణ హాని ఉందని, తక్షణం డిఐజి జోక్యం చేసుకుని తన భార్యను విడిపించి కుటుంబాన్ని రక్షించాలని అర్థించాడు.

జాబ్ కేలండర్ కోసం జలదీక్ష

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు జాబ్ కేలండర్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో ఆర్‌కె బీచ్‌లో జల దీక్ష నిర్వహించారు. ప్రభుత్వ శాఖల్లోని అన్ని ఖాళీ ఉద్యోగాలను తక్షణం భర్తీ చేయాలని, మెగా డిఎస్‌సి ప్రకటించాలని నినాదాలు చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వై.రాంబాబు, నాయకులు యు.నాగరాజు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయుల నిరసన

ప్రజాశక్తి - అరిలోవ : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు విశాఖ జిల్లా డిఇఒ కార్యాలయం వద్ద సంఘం విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యాన జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు అధ్యక్షతన ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. తక్షణమే అక్రమ బదిలీలు నిలిపివేయాలని, బదిలీ అయిన ఉపాధ్యాయులకు జివిఎంసి, భీమిలీ పరిధిలో 14 మందికి జీతాలు చెల్లించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధనకార్యదర్శి టిఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ, సమస్యలు పరిష్కరించకుంటే కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్.నాగమణి, పూర్వ జిల్లా ప్రధాన కార్యదర్శిలు తదాన అప్పారావు, వైఆర్కె.ప్రసాద్, జిల్లా గౌరవాధ్యక్షులు అనకాపల్లి పైడిరాజు, సహాధ్యక్షులు రొంగలి ఉమాదేవి, కోశాధికారి కె.రాంబాబు, కార్యదర్శులు సామ రాజులు, చుక్క సత్యం, ఉప్పాడ రాము, రియాజ్ అహ్మద్, టి.జగన్, ఉషారాణి, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


డిఇఒ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

నేరాలు ఘోరాలు

వ్యక్తి అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని మామిడిలోవ పంచాయతీ దబ్బంద గ్రామానికి చెందిన డెంకాడ అప్పన్న (65) ఈ నెల 8వ తేదీన తోటలోకి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదని కుమారుడు గోవింద స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పన్నకు మతిస్థిమితం సరిగా ఉండదని అప్పుడప్పుడు ఇలా ఇంటి నుంచి వెళ్లిపోతుంటాడని పేర్కొన్నారు. అయితే ఈసారి సుమారు వారం రోజులు కావస్తున్నా ఆచూకీ తెలియకపోవడంతో ఆందోళన చెందుతున్నామని కుమార్తె మరిడమ్మ, కుమారుడు గోవింద వివరించారు. అప్పన్నకు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆచూకీ తెలిసినవారు 8247881522, 8466937643 నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు. ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

22 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి -చీడికాడ: అక్రమంగా రవాణా చేస్తున్న 22కిలోల గంజాయితో పాటు ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నామని ఎస్సై రామారావు తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు కోణం పంచాయతీ గుడివాడ వద్ద బుధవారం మాటు వేసి గోనె సంచులతో 22 కేజీలు గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో ఇద్దరు వ్యక్తులు హుకుంపేట కు చెందినవారు కాగా, మరో వ్యక్తి తమిళనాడుకు చెందిన శరన్‌గా గుర్తించారు.

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని లింగంపేట నూకాలమ్మ ఆలయంలో హుండి చేసిన నిందితుడ్ని అరెస్టు చేసినట్లు కేడిపేట ఎస్సై ఉపేంద్ర తెలిపారు. ఈ నెల 11న నూకాలమ్మ ఆలయంలో హుండి చోరీపై ఆలయ అధ్యక్షులు గోలగొండ త్రిమూర్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దొంగతనానికి పాల్పడ్డ వి.మాడుగుల మండలం వంతర్లపాలెం గ్రామానికి చెందిన గంగుపాము శ్రీనివాసరావును గురువారం రామచంద్రపురం జంక్షన్ వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. పాత దొంగతనాల కేసుల్లో కొంత సొత్తు స్వాదీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేశారు.

టిడిపి మ్యానిఫెస్టోపై ప్రచారం

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 10వ వార్డు పరిధి సుందర్‌నగర్, ఆదర్శనగర్ ప్రాంతాల్లో కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి ఆధ్వర్యాన గురువారం టిడిపి మేనిఫెస్టోపై ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయబోయే పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గాడు అప్పలనాయుడు, కేతర సత్యనారాయణ, వెంకటరావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

సిఐల బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -భీమునిపట్నం, ములగాడ : స్థానిక పోలీస్ స్టేషన్ లా అండ్ ఆర్డర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా డి.రమేష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ సిఐగా పనిచేసిన కె.లక్ష్మణమూర్తి విశాఖ రేంజ్ విఆర్‌కు బదిలీపై వెళ్లారు. రమేష్ ఉత్తర సబ్ డివిజన్ నేర విభాగం సిఐగా పని చేసేవారు

ములగాడ : మల్కాపురం పోలీస్‌స్టేషన్ సిఐగా జిడి.బాబు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి పనిచేసిన సిఐ లూథర్‌బాబు సిటీ విఆర్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పారిశ్రామిక ప్రాంత కార్పొరేటర్లు నూతన సిఐని మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, బల్ల లక్ష్మణరావు, గంటా వర్మ, పెంట్ల బాలకృష్ణ, ఎం.సురేష్, సూర్యనారాయణ, గంటా జగన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మారికవలస గురుకులంలో పరిశీలన

ప్రజాశక్తి -మధురవాడ : మారికవలస గిరిజన గురుకుల ప్రతిభ ఇంగ్లీష్ మీడియం పాఠశాలను బాలల హక్కుల కమిటీ సభ్యులు జి.సీతారామ్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్ పర్సన్ రాధ సందర్శించారు. పాఠశాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయుల తోను, విద్యార్థులతోను ప్రత్యేకంగా మాట్లాడారు. విద్యా బోధనపై ఆరా తీశారు. జెవికె కిట్, పుస్తకాలు, వసతి సౌకర్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శివప్రసాద్ పాల్గొన్నారు.

దూదేకుల నూర్‌బాషా సంఘం పాలకవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-పెందుర్తి: దూదేకుల నూర్ బాషా సంక్షేమ సేవా సంఘం నూతన పాలకవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా షేక్ సైద్, వైస్ ప్రెసిడెంట్‌గా షేక్ గఫర్, సెక్రటరీగా ఎస్‌కె.సాహుల్, క్యాషియర్‌గా ఎస్‌కె.యాసిన్, జాయింట్ క్యాషియర్ ఎస్‌కె.పీర్‌సాహెబ్, జాయింట్ సెక్రటరీగా ఎస్‌కె సనావలి, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎస్‌కె.సలీమా, ఎస్‌కె.మున్నా, ఎస్‌కె.నబి, ఎస్‌కె.రహిమాన్, ఎస్‌కె.సుభాన్, ఎస్‌కె సకీర్, ఎస్‌కె.ఇస్మాయిల్, ఎస్‌కె అబ్దుల్లా, గౌరవాధ్యక్షులుగా కోళ్ల పీరు, సలహాదారులుగా ఎస్‌కె షఫీ ఎన్నికయ్యారు.

అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 11వ వార్డు పరిధి బాలాజీనగర్, వినాయకనగర్, దుర్గమ్మ గుడి నుంచి డ్రైవర్స్ కాలనీ శ్మశాన వాటిక వరకు, ముస్తాఫా కాలనీ, అప్సర కాలనీ, భరత్‌నగర్ ప్రాంతాలలో పలు అభివృద్ధి పనులకు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి గురువారం శంకుస్థాపనచేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, అభివృద్ధే ధ్యేయంగా ప్రతి వార్డులో మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. రూ.29 లక్షలతో బాలాజీనగర్ నుంచి వినాయక టెంపుల్ వరకు బిటి రోడ్డు, రూ.35 లక్షలతో దుర్గమ్మ గుడి నుంచి డ్రైవర్స్ కాలనీ శ్మశానవాటిక వరకు బిటి రోడ్డు, రూ.55 లక్షలతో ముస్తాఫా కాలనీలో ముస్లిం సోదరులకు సామాజిక భవనం, రూ.39 లక్షలతో ముస్తాఫా కాలనీ, భరత్‌గన్, అప్సర కాలనీలో బిటి రోడ్లు నిర్మాణం చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఇ ఎం.వెంకటరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పరిశోధనలే విజ్ఞానానికి మూలం

ప్రజాశక్తి -ములగాడ : పరిశోధనలే విజ్ఞానానికి మూలం అని, పరిశోధనల వల్ల అనేక సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయని మైక్రో బయాలజీ అధ్యాపకులు డాక్టర్ సిహెచ్. ప్రశాంతి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో నూతనంగా డిగ్రీలో చేరిన విద్యార్థినులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, ఉన్నత విద్యా బోధన పరిశోధనలపై ఆధారపడి ఉందన్నారు. అనంతరం 'సృజనాత్మక ఆలోచన' అంశంపై రసాయన శాస్త్ర అధ్యాపకులు వి.అంజలీదేవి మాట్లాడుతూ, సృజనాత్మక ఆలోచనలు అనేక సందేహాలకు దారితీస్తాయని, ఆ సందేహాలకు సమాధానాలు కనుగొనడం వల్ల జ్ఞానం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. సెయింట్ ఆన్స్ కళాశాలలోని ప్రయోగశాలల్లో జరిగిన కొన్ని ఆధునిక పరిశోధనలను సీనియర్ విద్యార్థులు జూనియర్లకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు గ్రూపులుగా నూతన అంశాలపై చర్చించి తమ అభిప్రాయాలను తెలియజేశారు. శాస్త్ర విజ్ఞానంలో ఇటీవల వస్తున్న మార్పులను ప్రత్యేకంగా చర్చించారు. వీరందరినీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ ప్రేమకుమారి అభినందించారు.

సిసి రోడ్డు పరిశీలన

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 59వ వార్డు పరిధి హిమాచల్‌నగర్‌లో కొత్తగా వేస్తున్న సిసి రోడ్డును గురువారం వార్డు వైసిపి అధ్యక్షులు పుర్రె సురేష్ యాదవ్ పరిశీలించారు. కాంట్రాక్టర్, క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది, వర్క్ ఇన్‌స్పెక్టర్‌కు పలు సూచనలు చేశారు. నాణ్యత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గాలి సన్యాసిరావు, స్టూడెంట్ ఇంచార్జ్ జిలాని, యూత్ నాయకులు ధర్మిరెడ్డి శ్రీను, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


సిసి రోడ్డును పరిశీలిస్తున్న పుర్రె సురేష్ యాదవ్

ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు సాధనకు పోరాటం

ప్రజాశక్తి-సీతమ్మధార : సంక్షేమ బోర్డు సాధన కోసం ఆటో డ్రైవర్లు పోరాడాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ పిలుపునిచ్చారు. పౌర గ్రంథాలయంలో ఆటో డ్రైవర్ల సదస్సు గురువారం నిర్వహించారు. జి.వామనమూర్తి అధ్యక్షతన జరిగిన సదస్సుకు ముఖ్య అతిథిగా పడాల రమణ, గౌరవ అతిథులుగా మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎం.బుచ్చిరాజు, జోన్-1 ట్రాఫిక్ ఎసిపి జాన్ మనోహర్ కుమార్, జోన్-2 ట్రాఫిక్ ఎసిపి జి.రాజీవ్‌కుమార్, ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు, ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, టూటౌన్ ఎస్‌ఐలు హాజరయ్యారు. అనంతరం సభనుద్దేశించి జి.వామనమూర్తి మాట్లాడుతూ, ఆటో డ్రైవర్ల మీద ఉన్న పోలీస్ పెండింగ్ ఈ చలనాలు రద్దు చేయాలని, పిఎఫ్, ఇఎస్‌ఐ, పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు చేయాలని, జీవో 21, 31ను రద్దు చేయాలని, దరఖాస్తు చేసుకున్న ఆటో డ్రైవర్లకు ఇల్లు మంజూరు చేయాలని, విశాఖలో ఆటోలకు పార్కింగ్ స్థలాలు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉత్తర నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త కెకె.రాజు మాట్లాడుతూ, ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం వాహన మిత్ర, అమ్మ ఒడి పథకాలు ప్రవేశపెట్టి అండగా ఉందన్నారు. విద్యలో మెరిట్ సాధించిన ఆటో డ్రైవర్ల పిల్లలకు ప్రయివేటు పాఠశాలలు, కాలేజీల్లో 25 శాతం సీట్లను కేటాయించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, పడాల గోవింద్, రవికృష్ణ, వివి.కృష్ణ, ఎన్.మధురెడ్డి, శివ, వై.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రయాన్-3 విజయవంతానికి ర్యాలీ

ప్రజాశక్తి -యంత్రాంగం

ఆనందపురం : చంద్రయాన్ 3 ఉపగ్రహం విజయవంతం కావాలంటూ నేలతెరు కెజిబివి విద్యార్థులు ర్యాలీ, ధ్యానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, బాలికల అభివృద్ధి అధికారి డాక్టర్ కాలేష్ బేగం, కెజిబివి ప్రత్యేకాధికారి చంద్రకళ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు .

భీమునిపట్నం : భారత అంతరిక్ష సంస్థ ఇస్రో చేపడుతున్న చంద్రయాన్ -3 విజయవంతం కావాలని కోరుతూ స్థానిక కెజిబివి విద్యార్థినిలు గురువారం పాఠశాల సమీపాన ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ గంగాకుమారి పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి చూపాలి

ప్రజాశక్తి -గాజువాక : నేటి యువత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకుంటూనే మరోవైపు క్రీడలపై ఆసక్తిని చూపాలని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహ పాత్రుడు సూచించారు. క్రీడాభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతగానో తోడ్పాటునందిస్తున్నాయని చెప్పారు. వార్డులోని భానోజీతోటలో ఏజె వారియర్స్ క్లబ్ ఆధ్వర్యాన కబడ్డీ శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రికెట్ తర్వాత అత్యంత ప్రాచుర్యం పొందింది కబడ్డీయేనన్నారు. జాతీయ, అంతర్జాతీయ పోటీలకు విశాఖ నగరం వేదిక కావాలని ఆకాంక్షించారు. అందుకు తగ్గట్టుగా కబడ్డీ క్రీడాకారులు తయారు కావాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కబడ్డీ సంఘం ప్రతినిధి ప్రసాద్‌రెడ్డి, కోచ్‌లు జయ, అంజనీ, సభ్యులు లక్ష్మణరావు, భూలోక, అప్పలరాజు, కుమార్‌వర్మ, వార్డు అధ్యక్షుడు లోకనాథం, మద్దాల అప్పారావు, నాగిశెట్టి శ్రీనివాస్, ఇరోతి గణేష్, దేముడు తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న నరసింహపాత్రుడు

మత్స్యకారుల త్యాగంతోనే గంగవరం నిర్మాణం

సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్

ప్రజాశక్తి- గాజువాక : గంగవరం మత్స్యకారులు ఇళ్లు, భూములు, సముద్ర వేటను త్యాగం చేసిన ఫలితంగానే గంగవరం పోర్టు నిర్మాణం జరిగిందని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ గుర్తుచేశారు. అదాని గంగవరం పోర్టు యాజమాన్యం మొండి వైఖరికి నిరసనగా నిర్వాసిత కార్మికులు చేపట్టిన నిరవధిక నిరసన దీక్ష గురువారం నాటికి 10వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు ఆర్‌కెఎస్‌వి.కుమార్, సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాస్, కార్యదర్శి బి.జగన్, పబ్లిక్ సెక్టార్ కో-ఆర్డినేషన్ కమిటీ కార్యదర్శి కుమారమంగళం, జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు పి.మణి నిరసన శిబిరాన్ని సందర్శించి సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, సర్వం త్యాగం చేసిన నిర్వాసిత కార్మికులకు అతి తక్కువ వేతనాలు చెల్లిస్తూ వారి శ్రమను అదాని యాజమాన్యం దోచుకుంటుందన్నారు. కార్మికుల జీతాలు పెంచమంటే ఉద్యోగాలు తొలగిస్తూ నోటీసులు, వాయిస్ మెసేజ్‌లతో కార్మికుల పట్ల బెదిరింపులకు పాల్పడుతోందని తెలిపారు. ఈ పోరాటంలో కార్మికులు విజయం సాధిస్తారని స్పష్టంచేశారు. విశాఖపట్నం పోర్టులో కనీస జీతం రూ.36,400 ఇస్తున్నారని, ఇక్కడ ఎందుకు ఇవ్వరని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం కలుగజేసుకొని సంప్రదింపులు ద్వారా సమస్యను పరిష్కరించాలని కోరారు.

వైసిపి గాజువాక నియోజకవర్గం ఇన్‌ఛార్జి తిప్పల దేవన్‌రెడ్డి మాట్లాడుతూ, జీతాల కోసం అదాని గంగవరం పోర్టు కార్మికులు చేస్తున్న పోరాటానికి వైసిపి అండగా ఉంటుందన్నారు. సమస్యను ఉత్తరాంధ్ర జిల్లాల వైసిపి కో-ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి, అవసరమైతే ముఖ్యమంత్రి దృష్టికి కూడా తీసుకెళ్తామని చెప్పారు.

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, గంగవరం పోర్టులో 10.4 శాతం రాష్ట్ర ప్రభుత్వ వాటాను నిర్వాసితులు, ప్రజల అనుమతి లేకుండా రాష్ట్ర ప్రభుత్వం అదానికి కట్టబెట్టిందని విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అండ చూసుకొని అదాని పోర్టు యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. ఈ పోరాటానికి సిపిఐ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. న్యాయవాది గంటా మోహన్, ప్రొఫెసర్ సూరప్పడు, సిపిఐ గాజువాక ఇన్‌ఛార్జి కసిరెడ్డి సత్యనారాయణ, సిఐటియు స్టీల్ జోన్ కార్యదర్శి కొవిరి అప్పలరాజు, వైసిపి మహిళా నాయకులు రోజారాణి, చిన్నతల్లి, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు పద్మ, శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గంగవరం పోర్టు ఎంప్లాయిూస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి లొల్లి తాతారావు, వాసుపల్లి ఎల్లాజీ, గంటిపిల్లి అమ్మోరు, మాద అప్పారావు, పేర్ల నూకరాజు, కదిరి సత్యానందం, నొల్లి స్వామి, గంటిపిల్లి లక్ష్మయ్య, కొవిరి అమ్మోరు తదితరులు పాల్గొన్నారు.



దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న ఆర్‌కెఎస్‌వి.కుమార్



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న శ్రీనివాసరావు

వేతనాల్లో కోతపై కాంట్రాక్టు కార్మికుల ఆగ్రహం

ప్రజాశక్తి-ఉక్కునగరం : వేతనాల్లో కోతపెట్టడంపై స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు కార్మికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. పలుచోట్ల ఆందోళనలు చేపట్టారు. కాంట్రాక్టు కార్మికులకు కోతపెట్టిన రూ.2400 వెంటనే చెల్లించక పోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని ఉక్కు యాజమాన్యాన్ని అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాలు హెచ్చరించాయి. ఈ మేరకు ఇడి వర్క్స్ కార్యాలయానికి వేలాదిమంది కార్మికులు చేరుకొని ఆందోళన చేశారు. ఉక్కు యాజమాన్యం నోటీస్ పే, బోనస్ పే, ఇఎస్ఐ తీసివేసి కార్మికులకు తీరని ద్రోహం చేసిందని యూనియన్ల నాయకులు చెప్పారు. నిలిపి వేసిన రూ.2400 వారం రోజుల్లో చెల్లిస్తామని యాజమాన్యం హామీ ఇచ్చిందని, ఈ హామీని నిలబెట్టుకోకపోతే సమ్మెకైనా కార్మికులు వెనుకాడరని హెచ్చరించారు. జిఎం హెచ్‌ఆర్ బినయ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నమ్మి రమణ, జి.శ్రీనివాసరావు, మంత్రి రవి, నందికి తాతారావు, అవతారం, వంశీ, సత్యారావు, కోన రమణ, బొడ్డు పైడిరాజు, ఉమ్మడి అప్పారావు, గురునాథ్, కె.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

టౌన్ అడ్మిన్ బిల్డింగ్ వద్ద ధర్నా

ఇదే అంశంపై సిఐటియు కాంట్రాక్ట్ కార్మికులు టౌన్ అడ్మిన్ బిల్డింగ్‌ను ముట్టడించారు. యాజమాన్యం తీరుపై పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకుడు వివి.రమణ మాట్లాడుతూ, తక్కువ వేతనాలతో పనిచేస్తున్న కార్మికులకు కాంట్రాక్టర్లు, యాజమాన్యం కుమ్మక్కై వేతనాలలో కోత విధించడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్మికులకు కోత విధించిన రూ.2,400 తిరిగి చెల్లించకపోతే పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లుప్పిని ఫౌండేషన్ సహకారంతో 50 మంది క్షయ రోగులకు పౌష్టికాహార కిట్లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎఎమ్‌హెచ్‌ఒ డాక్టర్ సిహెచ్ పురేంద్ర బాబు మాట్లాడుతూ, క్షయ రోగులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. లుపిని కంపెనీ ఒక్కొక్క రోగికి ఆరు నెలలు పాటు సరుకులు పౌష్టికాహారం అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.శ్రీనివాసరావు, సుధాకరరావు, అప్పారావు, వాసు పాల్గొన్నారు.

'ఉత్తరం'లో గ్రీవెన్స్

ప్రజాశక్తి-సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గంలో ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు వైసిపి సమన్వయకర్త కెకె.రాజు గురువారం పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి చెందిన పలువురు వచ్చి సమస్యలతో కూడిన వినతిపత్రాలను కెకె.రాజుకు అందించారు. వినతిపత్రాలను పరిశీలించిన కెకె.రాజు అధికారులతో మాట్లాడి కొన్నింటిని వెంటనే పరిష్కరించారు. మరికొన్నింటికి సంబంధించి అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

వైభవంగా అమ్మవార్ల పండగ

ప్రజాశక్తి -మాధవధార : మాధవధార సీతన్న గార్డెన్స్‌లోని కనక మహాలక్ష్మి, కనకదుర్గాలమ్మ, గాయత్రిదేవి అమ్మవార్ల పండగను గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, కళా హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ పైడి వెంకటరమణమూర్తికి ఆలయ ధర్మకర్త సనపల కీర్తి స్వాగతం పలికారు. ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త సనపల కీర్తి దంపతులు ప్రథమ పూజలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లూ చేశారు. ఈ కార్యక్రమంలో మాధవధార గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు.



గంటా శ్రీనివాసరావును అభినందిస్తున్న సనపల కీర్తి

882వ రోజుకు 'ఉక్కు' దీక్షలు

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 882వ రోజుకు చేరుకుంది. దీక్ష శిబిరంలో ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్, ప్లాంట్ డిజైన్, ఎఫ్ఎండి, సిఎంఇ, విఎస్‌జిహెచ్ విభాగాల కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తిని తగ్గించి నిర్వీర్యం చేయాలని చూస్తున్న యాజమాన్యం కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. దీనికోసం ఐక్య పోరాటాలు నిర్మించి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని స్పష్టంచేశారు.



దీక్షలో కూర్చున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులు

'ఉత్తరం'లో సమస్యలపై వినతి

ప్రజాశక్తి-సీతమ్మధార : గడపగడపకు మన ప్రభుత్వం కార్యాలక్రమంలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ ఎ.మల్లికార్జునకు ఉత్తర వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు గురువారం వినతిపత్రం అందించారు. పలు అభివృద్ధి పనులపై చర్చించారు.

వేగంగా భీమిలి అభివృద్ధి

- ప్రభుత్వ ప్రయివేట్ భాగస్వామ్యంతో ఆర్టీసీ బస్ కాంప్లెక్స్
- కొద్ది నెలల్లోనే అల్లూరి మ్యూజియం నిర్మాణం పూర్తి
- టిటిడి నిధులతో పద్మనాభ స్వామి ఆలయానికి ఘాట్ రోడ్డు
- నిర్మాణ వ్యయం పెరుగుదలతో పాండ్రంగి వంతెన నిర్మాణంలో జాప్యం
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం

భీమిలి నియోజక వర్గం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ప్రజాశక్తితో ఆయన మాట్లాడుతూ, కరోనా సమయంలో అభివృద్ధిలో కొంత జాప్యం జరిగిందన్నారు. గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను ప్రాధాన్యతా క్రమంలో ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక్కడి ప్రజలు, ప్రయాణికుల అవసరాల దృష్ట్యా తగరపువలసలో ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్ ఏర్పాటు ఎంతైనా అవసరమని, ప్రభుత్వం, ప్రయివేట్ సంస్థ భాగస్వామ్యంతో త్వరలో కాంప్లెక్స్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయనున్నట్లు వివరించారు. పద్మనాభం మండలం పాండ్రంగిలో రూ.2.50 కోట్లతో అల్లూరి సీతారామరాజు మ్యూజియం నిర్మాణం పనులు రెండు నెలల వ్యవధిలో పూర్తవుతాయన్నారు. పాండ్రంగి వంతెన నిర్మాణానికి తొలుత రూ.14 కోట్లు మంజూరు కాగా, పనుల్లో జాప్యం, ఇతర కారణాలతో నిర్మాణ వ్యయం పెరిగిందని తెలిపారు. అదనంగా మరో రూ.2.50 కోట్లు కలిపి మొత్తంగా రూ.16.50 కోట్లతో కొద్ది నెలల వ్యవధిలోనే వంతెన నిర్మాణం పూర్తవుతుందని స్పష్టం చేశారు.

టిటిడి నిధులతో పద్మనాభం మండల కేంద్రంలోని అనంత పద్మనాభస్వామి ఆలయానికి ఘాట్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఇదే విషయాన్ని ఇప్పటికే టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఎపి గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ నిధులు రూ.6.50 కోట్లతో చిల్లపేట పెద్దచెరువు సుందరీకరణ పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. భీమిలి జమ్మి చెరువు అభివృద్ధి, బీచ్‌లో జి 20 నిధులతో సెంట్రల్ లైటింగ్, చూడ ముచ్చటగా వాల్ పెయింటింగులు వేయడంతో బీచ్ సందర్శకులు ముచ్చట పడుతున్నారని వివరించారు.



చిల్లపేట పెద్ద చెరువులో సుందరీకరణ పనులు

భీమిలి ఉప్పుటేరు వద్ద 6 ఎకరాల విస్తీర్ణంలో రూ.28.7 కోట్లతో ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. తద్వారా మత్స్యకారుల వలసలు నివారించడం సాధ్యమవుతుందని చెప్పారు. తాజాగా భీమిలి మండలం అన్నవరం సముద్ర తీరం వద్ద రూ.350 కోట్లతో 40 ఎకరాల విస్తీర్ణంలో 7 నక్షత్రాలతో కూడిన లగ్జరీ రిసార్ట్‌కు వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

దొడ్డిదారి బదిలీలను రద్దు చేయాలని ధర్నా

ప్రజాశక్తి-అనకాపల్లి

దొడ్డిదారిన ఉపాధ్యాయుల బదిలీలను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ గురువారం జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి మాట్లాడుతూ బదిలీల ప్రక్రియ పూర్తయిన తరువాత కూడా అంగబలం, అర్థబలం, రాజకీయ పలుకుబడి ఉన్న ఉపాధ్యాయులకు కేటగిరీ -1కి బదిలీలు చేయడం అత్యంత శోచనీయమన్నారు. వాటిని వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు ఇప్పటి వరకూ జీతాలు అందక పోవడం అత్యంత దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు నెల్లి సుబ్బారావు, అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, మహిళా సహాధ్యక్షులు గాయిత్రి, కోశాధికారి జోగ రాజేష్, జిల్లా కార్యదర్శులు వి.చైతన్యశీలా, పొలిమేర చంద్ర రావు, ఎన్.శేషుకుమార్, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నాచేస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు


ఎమ్మెల్యే ధర్మశ్రీని కలిసిన నేతవానిపాలెం గ్రామస్తులు

బావి పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే చర్యలు

ప్రజాశక్తి -బుచ్చెయ్యపేట

మండలంలోని బుచ్చెయ్యపేట శివారు నేతవానిపాలెం గ్రామంలో అధికార పార్టీకి చెందిన వైస్ ఎంపీపీ గొంప వెంకటేశ్వరరాజు అర్ధరాత్రి సమయంలో కూల్చి వేసిన లచ్చన్న బావి పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ దిద్దుబాటు చర్యలను చేపట్టారు. ఆదివారం అర్ధరాత్రి సమయంలో వైస్ ఎంపీపీ లచ్చన నుయ్యిని జెసిబితో కూల్చి మట్టితో పూడ్చివేశారు. దీంతో నేతవానిపాలెం గ్రామస్తులు టిడిపి మాజీ ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు, నియోజకవర్గం ఇన్‌ఛార్జి బత్తుల తాతయ్యబాబు ఆధ్వర్యాన మండల కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అలాగే టిడిపి నాయకులు ఘటనా స్థలాన్ని సందర్శించారు. ఈ నేపథ్యంలో గురువారం నేతవానిపాలెం గ్రామానికి చెందిన నాయకులు, గ్రామస్తులు బుచ్చెయ్యపేట పిఎసిఎస్ అధ్యక్షులు సుంకర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రావికమతంలో స్థానిక ఎమ్మెల్యే ధర్మశ్రీని కలిసి సమస్యను వివరించారు. నుయ్యి పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని, తక్షణం అధికారుల నుయ్యి చుట్టూ కంచె ఏర్పాటుకు రూ.5000 నగదు అందజేశారు. భవిష్యత్తులో సదర స్థలం ఆక్రమణలకు గురికాకుండా నిధులను కేటాయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు గ్రామానికి చెందిన వెయ్యపు మాణిక్యం, రాజబాబు, బోడి రాము, వెయ్యపు రాము, బర్లకాన నాయుడు, బర్లికాన దేవుళ్ళు తెలిపారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

- ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి- యలమంచిలి

ఎట్టకేలకు మున్సిపాలిటీ పరిధి రామ్‌నగర్ రైల్వేగేటు నుంచి పరమేశ్వరి థియేటర్ మీదుగా రైల్వే స్టేషన్‌రోడ్డుకు చేరే రోడ్డుకు మోక్షం లభిస్తుంది. రూ.15 లక్షలతో ఈ రోడ్డు నిర్మాణానికి గురువారం ఉదయం మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపు వెంకట గుప్తా చేతుల మీదుగా భూమి పూజ నిర్వహించి పనులు ప్రారంభించారు. 'గుంతలతో గుండెలు జారుతున్నాయ్..!' శీర్షికన ప్రజాశక్తి గురువారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించి వెంటనే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ కె.వీరయ్య, 12వ వార్డు కౌన్సిలర్ పిల్లా త్రినాథరావు కనకమణి, మాజీ వార్డు మెంబరు త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు. దారి పొడవునా గోతులున్న రోడ్డు సిసి రోడ్డుగా నిర్మాణం చేపట్టడం ఆనందంగా ఉందని ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను కథనం ద్వారా మున్సిపాలిటీ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి తన వంతు కృషి చేసిన ప్రజాశక్తికి స్థానికులు కృతజ్ఞతలు తెలియజేశారు.


శంకుస్థాపన చేస్తున్న వైస్ చైర్మన్ గుప్తా

కాలుష్యం వెదజల్లే కంపెనీలపై చర్యలు తీసుకోవాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి డిమాండ్

ప్రజాశక్తి - పరవాడ

మండలంలోని జెఎన్ ఫార్మాసిటీలోని రాంకీ యాజమాన్యం సిఇటిపి ద్వారా చిమ్నీల్లో తీవ్రమైన కాలుష్యాన్ని వెదజల్లుతుందని, తక్షణమే చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ బుధవారం రాత్రి 9 గంటల నుండి అర్ధరాత్రి 2 గంటల వరకు ఫార్మా కంపెనీలు తీవ్రమైన కాలుష్యాన్ని వెదజల్లాయని, దీంతో ముక్కుమంట, కళ్ళు తిరగడం, వికారం వంటి లక్షణాలు సమీపంలో ఉన్న తానాం గ్రామంలో ఏర్పడిందని పేర్కొన్నారు. దీనిపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇఇకి ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయగా, వారు వెంటనే స్పందించి రాత్రి 12 గంటల సమయంలో మిషన్‌తో పరీక్షలు నిర్వహించి కాలుష్యం వెదజల్లినట్లు నిర్ధారించారని తెలిపారు. రాంకీ యాజమాన్యం కాలుష్యం సిమ్నీల్ ద్వారా వదలడమే కాకుండా సమీపంలో ఉన్న ఊరచెరువులోకి రసాయానిక వ్యర్ధ జలాలను విడిచిపెడుతుందని తెలిపారు. దీనివల్ల భూగర్భ జలాలు నాశనమవుతున్నాయని, నూతనంగా తవ్విన చెరువు వల్ల మరింత కాలుష్యం పెరిగే అవకాశం ఉందని చెప్పారు. వెంటనే చెరువు మూసివేయాలని, కాలుష్యాన్ని అరికట్టాలని, రాంకీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాంకీ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు.


ఫార్మా కంపెనీలు బుధవారం రాత్రి విడుదల చేస్తున్న కాలుష్యం

విత్తన శుద్ధితో చీడపీడల నివారణ

ప్రజాశక్తి- బుచ్చెయ్యపేట : బీజామృతంతో విత్తన శుద్ధి చేయడం వల్ల చీడపీడల నివారణతోపాటు, అధికోత్పత్తి సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ సూరిబాబు అన్నారు. గురువారం మండలంలోని దిబ్బిడి గ్రామంలో ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేస్తున్న బీజామృతం తయారీ, వినియోగంపై అవగాహన కల్పించారు. బీజామృతంతో విత్తన శుద్ధి చేసి నారుమడులలో చల్లారు. జెర్రిపోతుల రామారావు, స్థానిక రైతులు పాల్గొని విత్తన శుద్ధి చేసుకున్నారు. ఎమ్సిఆర్పీ సూరిబాబు, ఐసిఆర్పీలు పవన్, లక్ష్మి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి, పాల్గొన్న విద్యాశాఖ అధికారులు, హెచ్ఎంలు

గంజాయి అక్రమ రవాణాలో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-కె.కోటపాడు : మండలంలోని ఆనందపురం జంక్షన్లో ఈనెల 12వ తేదీన గంజాయి అక్రమ రవాణాను అడ్డుకుని నమోదు చేసిన కేసులో మరో నిందితుడిని అరెస్టు చేశామని మండలంలోని ఎ.కోడూరు ఎస్ఐ బి.రామకృష్ణ గురువారం సాయంత్రం విలేకరులకు తెలిపారు. 22 కిలోల గంజాయిని తరలిస్తున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన రాజేష్ కన్నన్ సౌందర్య పండిను బుధవారం ఆనందపురం కూడలిలో అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసుతో సంబంధం ఉన్న పెదబయలు మండలం బొంగరం గ్రామానికి చెందిన కిముడు చిట్టిదొర(40)ను గురువారం జి.మాడుగుల మండలం మద్దిగరువులో అరెస్టు చేసి చోడవరం కోర్టులో హాజరు పరిచామని చెప్పారు.

విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపర్చాలి

జిల్లా కలెక్టర్ రవి పఠాన్‌శెట్టి

ప్రజాశక్తి- అనకాపల్లి

పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపరిచే దిశగా ఉపాధ్యాయులు, అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రవి పఠాన్ శెట్టి ఆదేశించారు. గురువారం గుండాల జంక్షన్ సచివాలయ సమావేశ మందిరంలో విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. స్కూల్ ఆవరణ, తరగతి గదులలో ఆహ్లాదకర వాతావరణం ఉండేలా, పారిశుధ్యం - పరిశుభ్రత పక్కాగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు విద్యాబోధనలో అవసరమైన మార్పులు చేసి విద్యార్థులలో జిజ్ఞాసను కలిగించడం, ఆసక్తి పెంచడం ద్వారా ప్రజ్ఞను వెలికి తీయాలని ఆదేశించారు. విద్యార్థులలో అవగాహన స్థాయిని తెలుసుకునేందుకు 3 నుంచి 10 వ తరగతి విద్యార్థులకు వారాంతపు పరీక్షలు నిర్వహించాలన్నారు. డిజిటల్ టెక్నాలజీ వినియోగం పెంచేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రానున్న సంవత్సర పదవ తరగతి పరీక్షలలో నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా పనిచేయాలన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మికులు, ముందస్తు గర్భం మొదలైన వాటివల్ల జరిగే నష్టాలను తెలియజేస్తూ సాంఘిక విషయాలపై విద్యార్థులలో అవగాహన కలుగజేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి వెంకట లక్ష్మమ్మ, ఏడి రవిబాబు, ఎంఇఒలు, ఏపీడబ్ల్యుఐడీసీ జెఇ ప్రసాద్, సర్వశిక్షా అభియాన్ ఈఈ నారాయణరావు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పూడిమడకలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని పూడిమడక గ్రామంలో గురువారం ఎమ్మెస్ పరిశ్రమ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సాధారణ రోగులను, ఎముకలు కీళ్ల వ్యాధులకు సంబంధించిన రోగులను వైద్యులు పరీక్షించారు. మందులు ఉచితంతా అందజేశారు. ఈ సందర్భంగా పరిశ్రమ అడ్మిన్ మేనేజర్ యోగానంద ప్రసాద్ మాట్లాడుతూ పరిశ్రమ సిఎస్ఆర్ నిధుల నుండి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ శిబిరంలో మృణిల, వైద్యులు సురేష్, బాలకృష్ణ, మాజీ సర్పంచ్ చాపల వెంకటరమణ, కొవిరి శ్రీను పాల్గొన్నారు.

జలపాతం వద్ద పెద్దపులి అడుగుజాడలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని వాలాబు సరియా జలపాతం వద్ద గురువారం పెద్దపులి అడుగుజాడలు గుర్తించినట్లు చోడవరం ఫారెస్ట్ రేంజ్ అధికారి రవి వర్మ బృందం తెలిపింది. జలపాతం పరిసర ప్రాంతాలలో పెద్దపులి సంచరిస్తున్నట్లు గుర్తించడం జరిగిందని, జలపాతం పరిసర గిరిజన ప్రాంత వాసులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సరియా జలపాతంకు వెళ్లే పర్యాటకులు ఈ విషయం గమనించాలన్నారు. అంతా జాగ్రత్త వహించాలని ఆయా గ్రామాలలో దండోరా వేస్తున్నారు.

ట్రిపుల్ ఐటిలో గురుకుల విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-అనకాపల్లి : గురువారం నాడు విడుదలైన ఎపి ట్రిపుల్ ఐటి మెరిట్ లిస్టులో అనకాపల్లి మహాత్మ జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. గురుకులం నుండి 10వ తరగతి ఉత్తీర్ణులైన జయదేవ్, కిరణ్ గణేష్, దేవకుమార్, వంశి అజయ్, ఆడారి గోపి, సిహెచ్ రామకృష్ణ, కర్రి జయవర్ధన్‌కు ట్రిపుల్ ఐటి మెరిట్ లిస్టులో ప్రవేశం సాధించారు. అనకాపల్లి జిల్లాలో ఒకే పాఠశాల నుండి ఏడుగురికి ట్రిపుల్ ఐటి సీట్లు సాధించి గురుకుల పాఠశాల రికార్డు సృష్టించింది. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తమపై తల్లిదండ్రులు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల ప్రోత్సాహం మరువలేనిదని, ట్రిపుల్ ఐటి సీటు సాధించడంతో తమపై మరింత బాధ్యత పెరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది ఎంపికైన విద్యార్థులను అభినందించారు.

చీమలపల్లిలో 'జనవాణి'

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని చీమలపల్లి గ్రామంలో బుధవారం రాత్రి జనసేన పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి సుందరపు విజయ్ కుమార్ జనవాణి కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పురవీధులలో ర్యాలీగా తిరిగారు. మహిళలను కలిసి కరపత్రాలు అందజేశారు. గాజు గ్లాసులు చూపించి ఎన్నికలలో ఈ గుర్తుపై ఓట్లేసి తనను గెలిపించాలని కోరారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా ఎలమంచిలి నియోజకవర్గంలో కన్నబాబురాజు ఎమ్మెల్యేగా చేసిందేమీ లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జనపరెడ్డి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పైల రామనాయుడు, పప్పల నూకన్న దొర, రవి, చొప్ప శ్రీను, చోడపల్లి అప్పారావు, అన్నం బాబ్జి, పప్పల రమణ, లాలం సోమునాయుడు, జాగారపు కేశవ, అగ్గాల భాస్కరరావు పాల్గొన్నారు.


మహిళలతో మాట్లాడుతున్న సుందరపు విజయ్‌కుమార్

మెప్మా అర్బన్ మార్కెట్ ప్రారంభం

ప్రజాశక్తి - యలమంచిలి

స్థానిక ధర్మవరం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం దగ్గర ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్కెట్‌ను యలమంచిలి ఎమ్మెల్యే యువి.రమణమూర్తి రాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకొని స్వావలంబన సాధించడం ద్వారా అనేక అద్భుతాలు జరుగుతాయని, ఆ దిశగా మెప్మా సభ్యులు అడుగులు వేయాలని కోరారు. అధిక సంఖ్యలో పాల్గొని తమ మార్కెట్ ఉత్పత్తుల్ని స్టాల్స్‌లో ప్రదర్శించారు. కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ, మున్సిపల్ కమిషనర్ వీరయ్య, ఎంపిపి గోవిందరావు, వైస్ చైర్మన్లు బెజవాడ, ఆరెపు గుప్తా, సందీప్, మెప్మా అధికారులు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

కాలువల పూడికతీత పనులు ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి

జివిఎంసి అనకాపల్లి జోన్ పరిధిలో ప్రధాన ఏల్లయ్య పంట కాలువ పూడికతీత పనులు గురువారం ప్రారంభమయ్యాయి. వైసిపి పార్లమెంటరీ పరిశీలకులు దాడి రత్నాకర్ అధికారులకు వినతిపత్రం సమర్పించిన వారం రోజుల్లోనే ఈ పనులు ప్రారంభించడం గమనార్హం. గురువారం రత్నాకర్ కాలువ పూడికతీత పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోటి రూపాయలతో పట్టణంలోని గుండాల జంక్షన్ నుంచి మున్సిపల్ ఆఫీస్, ఎన్టీఆర్ గ్రౌండ్ నుంచి ఎన్టీఆర్ ఆసుపత్రి మీదుగా, గవరపాలెం కర్రివారివీధి, సంతబయలు కాలువ అంతా పూడికలు తొలగిస్తామని చెప్పారు. వర్షాలు రాకముందే ఈ పనులు పూర్తి చేస్తామన్నారు. పట్టణంలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తున్నామని, ఈ పనులు కూడా మూడు నాలుగు రోజుల్లో మొదలు కానున్నాయని తెలిపారు. ఆయన వెంట వైసిపి జీవీఎంసీ 80వ వార్డు ఇన్‌ఛార్జి కొణతాల భాస్కరరావు, భీశెట్టి కృష్ణ అప్పారావు ఉన్నారు.

ప్రగతి సాక్ష్యం ఉపకార వేతనాలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-అనకాపల్లి : అఖిల భారత సాంకేతిక విద్యా మండలి ద్వారా అనకాపల్లి జిల్లా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు 16 మంది ప్రగతి సాక్ష్యం ఉపకార వేతనాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా గురువారం కళాశాల ప్రిన్సిపాల్ బివిఎస్ఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఏడాదికి 50 వేల రూపాయల చొప్పున మూడేళ్లలో లక్షా 50 వేల రూపాయల ఉపకార వేతనం ఎంపికైన ప్రతి విద్యార్థి పొందుతారని తెలిపారు. ఈ ఉపకార వేతనాన్ని విద్యార్థులు ఇతర అవసరాలకు కాకుండా విద్య ఉపాధి అవకాశాలకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉపకార వేతనాలకు ఎంపికైన విద్యార్థులను అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

ఉపాధ్యాయులపై కక్ష సాధింపు అన్యాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉద్యోగ విరమణకు సిద్ధంగా ఉన్న 200 మంది మహిళా, పురుష ఉపాధ్యాయులను ఏజెన్సీ ప్రాంతాలకు బదిలీ చేయడం ముమ్మాటికీ విద్యాశాఖ మంత్రి బొత్స కక్ష సాధింపు చర్యలకు నిదర్శనమని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు పేర్కొన్నారు. వైసిపి ప్రభుత్వానికి వ్యతిరేకంగా విజయవాడలో నిర్వహించిన ఊరేగింపు దృష్టిలో పెట్టుకొని ఉపాధ్యాయులపై కక్ష సాధింపు చర్యలకు పూనుకున్నారని ఆరోపించారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సిఫార్సులతో చేస్తున్న ఉపాధ్యాయ అక్రమ బదిలీలను తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. మంత్రి బొత్స బదిలీలకు ముందు 200 మంది ఉపాధ్యాయులను ప్రభుత్వ సిఫార్సులతో బదిలీలు చేశారని, ఇప్పుడు సాధారణ బదిలీలు ముగిశాక మరో 500 మందిని బదిలీలు చేసినట్లుగా తెలుస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ సిఫార్సులతో బదిలీలు చేపట్టడం వల్ల మొత్తం బదిలీల ప్రక్రియ అపహాస్యానికి గురైందని విమర్శించారు. బదిలీ ఉపాధ్యాయులకు ఇప్పటికీ జీతాలు ఇవ్వకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. సమావేశంలో టిడిపి నాయకులు బోడి వెంకటరావు, కుప్పిలి జగన్మోహన్, మల్ల గణేష్, గుడాల సత్యనారాయణ, మల్ల శివన్నారాయణ, బర్నికాన శ్రీనివాసరావు, పూడి త్రినాధ, బుద్ద భువనేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు నాగజగదీశ్వరరావు

సింహాచలంనాయుడు కుటుంబానికి పోలీసులే అన్యాయం చేశారు

ప్రజాశక్తి- దేవరాపల్లి

మండల కేంద్రంలో మార్చి 18న రాత్రి సమయంలో అనుమానస్పదంగా మృతి చెందిన జామి సింహాచలంనాయుడు కుటుంబానికి పోలీసులే తీవ్రమైన అన్యాయం చేశారని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వెంకన్న సింహాచలంనాయుడు కుటుంబ సభ్యులు ఆరోపించారు. దేవరాపల్లి మండల కేంద్రంలో సింహాచలం నాయుడు తల్లి సింహాచలమ్మ, గవిరెడ్డి దేముడునాయుడు, బండారు అప్పలనాయుడు, జామి శ్రీను, చొక్కాకుల దేముళ్ళు, జామి చిన్నం నాయుడు, పాసిల వెంకటరావు, పి.సతీష్ తదితరులతో కలిసి గురువారం వెంకన్న విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. సింహాచలంనాయుడు మృతికి సంబంధించి అనుమానితులపై కేసులు పెట్టాలని ఏప్రిల్ 14న స్థానిక పోలీసు స్టేషన్ ఎదుట నిరాహార దీక్ష చేశామని తెలిపారు. నాడు అనకాపల్లి డిఎస్‌పి ఫోన్‌లో మాట్లాడి కె.కోటపాడు ఎస్సై ధనుంజేయరావును కేసు దర్యాప్తుకు నియమిస్తామని, కేసులో పురోగతి సాధించని ఎడల కేసుకు సంబంధించిన ఫైల్ మృతుని తల్లికి ఇస్తామని, అవసరమైతే కోర్టులో ప్రైవేటు కేసు వేసుకోవచ్చని ఆయన హామీ ఇవ్వడంతో దీక్ష విరమించామని పేర్కొన్నారు. పోలీసులు కేసులో పురోగతి సాధించకపోగా ఫైనల్ పోస్ట్‌మార్టంలో సింహాచలంనాయుడు పురుగుల మందు తాగి ఉరి వేసుకున్నారని పోలీసులు తెలిపారని వెల్లడించారు. సింహాచలంనాయుడు ఆత్మహత్య చేసుకుంటే, దానికి ప్రేరేపించిన వారిపై కేసు అయినా పెట్టండి, లేదా కేసుకు సంబంధించిన ఫైల్ అయినా ఇవ్వాలని కె.కోటపాడు పోలీసు స్టేషన్ చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా రెండూ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సింహాచలంనాయుడు హత్యను పోలీసులు కావాలనే ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపించారు. పురుగుల మందు తాగిన వ్యక్తి మళ్లీ ఉరి వేసుకోవలసిన అవసరం ఏముందని ప్రశ్నించారు. సింహాచలంనాయుడు కుటుంబానికి న్యాయం జరిగే వరకు దేవరాపల్లి ప్రజల మద్దతు కూడగట్టి దశలవారీగా ఆందోళన చేస్తామని వారు స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న వ్యకాస నేత వెంకన్న, చిత్రంలో కుటుంబ సభ్యులు

సంక్షేమం - అభివృద్ధి రెండు కళ్లు : ముత్తంశెట్టి



ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ప్రజాశక్తి -భీమునిపట్నం : నాలుగేళ్ల వైసిపి పాలనలో సంక్షేమంతో పాటు అభివృద్ధి సమాంతరంగా జరుగుతోందని, అభివృద్ధి, సంక్షేమం ఈ ప్రభుత్వానికి రెండు కళ్లు అని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జివిఎంసి నాలుగో వార్డు పరిధి చేపలుప్పాడ సామాజిక భవనం వద్ద గురువారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ, సముద్రానికి సమీపంలోనే మత్స్య కారులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇందుకోసం అవసరమనుకుంటే నిబంధనలు సడలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్డీవో ఎస్.భాస్కరరెడ్డి, వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, వివిధ విభాగాల అధికారులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు

రోలుగుంట : రోలుగుంట మండలం కొవ్వూరు, రోలుగుంట గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పాల్గొన్నారు. లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 రకాల సేవలను ఉచితంగా పొందాలన్నారు.

మునగపాక రూరల్ : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎలమంచిలి శాసనసభ్యులు యువి.రమణమూర్తి రాజు అన్నారు. మండలంలోని పాటిపల్లి, రాజుపేట సచివాలయాల్లో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం అర్హులైన వారికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు.సుకుమార్ వర్మ, జెడ్పిటిసి పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపిపి మళ్ల జయలక్ష్మి, డిఎల్‌డిఓ మంజులవాణి, ఎంపిడిఓ మన్మధరావు, తహశీల్దారు ప్రకాష్ రావు, ఈవోపీఆర్డీ పివిఎల్ఎన్.ఈశ్వరరావు, వైసిపి నాయకులు ఆడారి గణపతి అచ్చం నాయుడు, పొలిమేర గణేష్ పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని ఖాజీపాలెం, పెదపాడు గ్రామాల్లో గురువారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే యువి.రమణమూర్తి రాజు పాల్గొని మాట్లాడారు. పెదపాడు గ్రామంలో డిసిసిబి మాజీ చైర్మన్ సుకుమార వర్మను ఎంపిపి కోన సంధ్య బుజ్జి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జెడ్పిటిసి సభ్యులు లాలం రాంబాబు, వైసిపి నాయకులు కోన బుజ్జి, దేశం శెట్టి శంకర్రావు, సర్పంచ్‌లు దొడ్డి వెంకటలక్ష్మి, పీర్ల నర్సింగరావు, తహశీల్దారు వై.శ్రీనివాసరావు ఎంపిడీవో పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం గ్రామ సచివాలయాలలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఎంపీపీ బోకం సూర్యకుమారి రామునాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్‌పి వైస్ చైర్మన్ తుంపాల అప్పారావు, తహశీల్దార్ బి.సత్యనారాయణ, ఎంపిడిఓ బి.రమేష్ నాయుడు, వైస్ ఎంపీపీ చొక్కాలు గోవింద్, సర్పంచ్‌లు బండారు మంగ శ్రీనివాస్, బోను దేముడమ్మ నాయుడు, ఎంపీటీసీలు గోర్లి కనకరాజు, వైసిపి నాయకులు కోటాన రాము, సబ్బవరపు ముత్యాలనాయుడు పాల్గొన్నారు.



కంపెనీ ఎదుట ఆందోళన చేస్తున్న సుందరయ్యపేట గ్రామస్తులు

డిస్టలరీ కంపెనీ కాలుష్యంపై ఆందోళన

ప్రజాశక్తి- కశింకోట : మండలంలోని సుందరయ్య పేట గ్రామంలో ఉన్న విశాఖ డిస్టలరీ (మద్యం కంపెనీ) కాలుష్యంపై గురువారం ఆ గ్రామస్తులు కంపెనీ ఎదుట ఆందోళన చేపట్టారు. ఉదయం వచ్చిన కార్మికులను లోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ కంపెనీ విడుదల చేసిన కాలుష్యం వల్ల నీరు కలుషితమైందని, గ్రామంలో మంచినీటి బోరుల నీరు దుర్వాసన వస్తుందని తెలిపారు. పోయిన ఏడాది ఈ విషయమై మొరపెట్టుకున్నామని, అయిన నేటికీ ఈ సమస్య పరిష్కారం కాలేదు గ్రామస్తులు తెలిపారు. ఆందోళనపై కంపెనీ ప్రతినిధి శ్రీనివాసరావు మాట్లాడుతూ గురువారం కంపెనీ పనులు నిలిపి వేయడం జరుగుతుందని చెప్పారు. సమస్యలు పరిష్కారం కోసం నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆందోళన సమాచారం తెలుసుకున్న కశింకోట యస్ఐ ఆదినారాయణ రెడ్డి కంపెనీ వద్దకు వచ్చి పర్యవేక్షించారు.

సందడిగా గ్రామ దేవతల పండగలు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : మండలంలోని హరిపాలెం, తిమ్మరాజుపేట గ్రామాలలో గురువారం గ్రామ దేవతల పండగలు జరిగాయి. హరిపాలెం గ్రామంలో మరిడిమాంబ అమ్మవారి పండగ సందర్భంగా భక్తులు ఆలయంలో పసుపు కుంకుమలతో పూజలు చేశారు. అమ్మవారి వేషధారణతో గరగలు తిరిగారు. నాటికల ప్రదర్శన ఏర్పాటు చేశారు. తిమ్మరాజుపేటలో పసల మారమ్మ పండగ సందర్భంగా మహిళలు వేపకొమ్మలు మంచినీరు పసుపు కుంకుమలతో సామూహికముగా గ్రామ చావడి నుంచి తరలి వెళ్లారు. మహిళలు కోలాట ప్రదర్శన చేశారు. పసల మారమ్మ దగ్గర పూజించిన పసుపు కలిపిన నీటిని పశువులకు రక్షణగా వాటిపై వేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సరగడం శివ బాబు నాయుడు, భవిరిశెట్టి రవికుమార్, శరణం గోవిందా తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతుల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : సంచార జాతుల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించి ఆదుకోవాలని అఖిలభారత సంచార జాతుల అభివృద్ధి మండలి ఏపి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు రొట్ట లక్ష్మి డిమాండ్ చేశారు. అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రి ఎదురుగా ఉన్న మేదర్ల కాలనీలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సీడ్ ప్రోగ్రాం ద్వారా నిధులు కేటాయించి సంచార జాతులను ఆదుకోవాలని, డిఎన్‌టి కమిషన్ ఏర్పాటు చేయాలని, సంచార డిఎన్‌టి కులాలకు అట్రాసిటీ చట్టం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కొన్ని సంచార కులాలకు కుల కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా నిధులు ఇవ్వలేదని, తక్షణమే నిధులు ఇవ్వాలని కోరారు. సంఘం నాయకులు పసుపులేటి సావిత్రి, అన్నపురెడ్డి నూకమ్మ, రెడ్డి లోవ, పసుపులేటి గౌరీ, రొట్ట ఈశ్వరరావు, రొట్ట ఆదినారాయణ, పిల్లి శ్రీను, యానం సంతోష్, పసుపులేటి నీలకంఠం, రెడ్డి అర్జున పాల్గొన్నారు.

చంద్రయాన్-3కి మద్దతుగా ర్యాలీ

ప్రజాశక్తి- దేవరాపల్లి

శ్రీహరి కోట నుంచి శుక్రవారం నింగికి ఎగరనున్న చంద్రయాన్-3, భారత వ్యోమనౌక ప్రయోగం విజయవంతం కావాలని స్థానిక కెజిబివి విద్యార్థులు తమ పాఠశాలల్లో గురువారం ర్యాలీ నిర్వహించారు. చంద్రయాన్-3 నమూనా చిత్రాలను చేతబట్టి నినాదాలు చేశారు. కెజిబివి ప్రత్యేక అధికారి చొక్కాకుల భువన మాధురి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బాలికలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొల్లి రవీంద్రను కలిసిన బిసి నాయకులు

ప్రజాశక్తి- అనకాపల్లి

మాజీ మంత్రి, టిడిపి బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు కొల్లి రవీంద్ర శ్రీకాకుళం జిల్లా పర్యటనలో ఆయన్ను గురువారం టిడిపి బిసి గవర సాధికారత రాష్ట్ర కన్వీనర్ మళ్ల సురేంద్ర, బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రవీంద్రను సాలువతో సత్కరించారు. అనకాపల్లిలో చేపడుతున్న బీసీ కార్యక్రమాల గురించి వివరించి భవిష్యత్తులో చేపట్టిపోయే కార్యక్రమాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాజమండ్రి నారాయణరావు, ప్రసాద్, గుర్రం నూకరాజు, బుద్ద త్రినాథ్, తమ్మిన విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాయ, పప్పు జాతి గడ్డి పెంచుకోవాలి

ప్రజాశక్తి- కశింకోట

పాడి రైతులు కాయ, పప్పు జాతి గడ్డిని పెంచుకోవాలని కన్నూరుపాలెం పశువైద్యాధికారి డాక్టర్ దయనా పేర్కొన్నారు. గురువారం మండలంలోని జగనన్న పాలవెల్లువ గ్రామమైన ఈ.చౌడవాడ, పాత కన్నూరుపాలెంలో పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా పాడి రైతులతో సమావేశం నిర్వహించి క్షేత్ర పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడికి ఆధారం పచ్చిమేత అని, పాల ఉత్పత్తిని పెంచడానికి నాణ్యమైన పశుగ్రాసాన్ని సాగు చేసుకోవాలని సూచించారు. అనంతరం రైతులకు, సూపర్ నేపియర్ కణుపులను, జొన్న విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాడి రైతులు పాల్గొన్నారు.

మొక్కల నాటివేత

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: గ్రీన్ మిలీనియం కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పండ్ల మొక్కలు నాటారు. స్వయం సహాయక సంఘ సభ్యులు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లక్ష పండ్ల మొక్కలు నాటుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సర్ల రాజేశ్వరి, ఎంపీడీవో జయ మాధవి, ఉపాధి హామీ పథకం ఏపీవో నాని బాబు, వెలుగు ఏపిఎం పార్వతి బాయ్, మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సత్యనారాయణ, యువజన నాయకుడు శేఖర్, వేములపూడి ఎంపిటీసీ వెంకటేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రమీల గాంధీ

21 నుంచి ఓటర్ల నమోదు

ప్రజాశక్తి -కొత్తకోట: ఈ నెల 21 నుంచి చేపట్టనున్న ఇంటింటికి ఓటర్ల నమోదు, పరిశీలన కార్యక్రమాన్ని బిఎల్‌వో, సూపర్ వైజర్లు విజయ వంతం చేయాలని చోడవరం నియోజకవర్గం ఎలక్ట్రోలర్ రిజిస్ట్రేషన్ అధికారి (ఓటర్లు నమోదు అధికారి) కె. ప్రమీల గాంధీ సూచించారు. రావికమతం మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ మహేశ్వరరావు ఆధ్వర్యంలో మండల, గ్రామ స్థాయి ఎన్నికల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకూ నెల రోజుల పాటు నిర్వహించే డోర్ టు డోర్ కార్యక్రమం అత్యంత కీలకమన్నారు. అందుకు సంబంధించి బిఎల్‌వో, సూపర్ వైజర్‌లకు శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ చినబ్బాయి పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న వైద్య సిబ్బంది

డెంగీపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-గొలుగొండ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది గురువారం డెంగీపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ, డెంగ్యూ పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటిని నిల్వ ఉంచరాదన్నారు. కొబ్బరి బొండాలు, టైర్లు ఇంటి పరిసరాల్లో ఉంచరాదన్నారు.



నిరసన చేపడుతున్న నేతలు

జనసేన నిరసన

ప్రజాశక్తి-మాడుగుల: రహదారుల అధ్వాన స్థితి పై గురువారం ఎం.కోటపాడు వద్ద జన సైనికులు నిరసన చేపట్టారు.జన సేన నేతలు రాయపరెడ్డి కృష్ణ, గుమ్మడి శ్రీరామ్ వీర సురేఖ పాల్గొన్నారు వాలంటీర్లపై పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. కొందరు వాలంటీర్లు మాత్రమే ఇటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని, మిగిలిన అందరూ నిజాయితీగానే పని చేస్తున్నారన్నారు.

రోడ్డు మరమ్మతు చేపట్టాలని.. సిపిఎం సంతకాల సేకరణ

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: మండలంలో అడ్డురోడ్డు నుండి నర్సీపట్నం వెళ్ళే ఆర్అండ్‌బి రోడ్డ మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని సిపిఎం సంతకాల సేకరణ చేపట్టింది. గురువారం ఉదయం పెదగుమ్ములూరు శివారు నీలాద్రిపురం వద్ద సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు యం అప్పలరాజు నేతృత్వంలోని వాహనదారుల నుండి సంతకాలు సేకరించారు. అనంతరం అప్పలరాజు మాట్లాడుతూ,ఏజెన్సీ ముఖద్వారమైన నర్సీపట్నంకు అడ్డురోడ్డు నుండి రోజు వందలాది వాహనాలు ప్రయాణిస్తుంటాయన్నారు. అనునిత్యం ఆటోలు, బస్సులు, లారీలు, బైక్‌లు ఇతర వాహనాలు ప్రయాణించే ఈ మార్గం పెద్ద పెద్ద గోతులతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గతుకుల రోడ్డు మూలంగా అనేక మంది వాహనదారులు ప్రమాదాలకు గురయ్యారన్నారు. ఎన్నిమార్లు ఈ ప్రభుత్వానికి మొర పెట్టినా ఫలితం శూన్యమన్నారు. సంతకాల సేకరణ చేసి జిల్లా కలెక్టరుకు పంపుతామని, స్పందన లేకపోతే ఉద్యమరూపంలో కార్యాచరణ చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి యం సత్యన్నారాయణ, యం.రాజేష్, జి డేవిడ్ రాజు, బి నాగేశ్వరరావు, వి.అప్పన్న, కె.గోవిందరావు, సి హెచ్ మాధవస్వామి, పి.రాజుబాబు, టి.రమేష్, జి రాజుబాబు పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న సిపిఎం నేతలు

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: మున్సిపాలిటీ నాలుగో వార్డ్‌లో ఎమ్మెల్యే గణేష్ గడపగడపకి మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గురువారం పర్యటించారు. వార్డ్‌లో రోడ్డు, డ్రైనేజీలు, కరెంట్ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు తీసుకు వచ్చారు. నిరుపయోగంగా ఉన్న పబ్లిక్ లెట్రిన్స్ తొలగించాలని కోరారు.సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సుబ్బలక్ష్మి. వైస్ చైర్మన్ రామకృష్ణ, వార్డ్ కౌన్సిలర్ దాడి కృష్ణవేణి, వార్డు ఇంచార్జ్ దాడి బుజ్జి, మాజీ వైస్ చైర్మన్ గొలుసు నరసింహమూర్తి, జగదీశ్వరి, గన్నమ్మ, లలిత, రోజా, మున్సిపల్ కమిషనర్ కనకరావు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

వాహనాల సీజ్

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: గోవుల అక్రమ రవాణాకు నర్సీపట్నం సర్కిల్ ఇన్స్పెక్టర్ సమ్మి గణేష్ అడ్డుకట్ట వేశారు. ఈ సందర్భంగా సర్కిల్ ఇన్స్పెక్టర్ గణేష్ మాట్లాడుతూ, బుధవారం సాయంత్రం రెండు వాహనాలలో సర్సీపట్నం మీదుగా 18 గోవులను తరలిస్తున్నారన్నారు. వాహనాలను తనిఖీ చేయగా రెండు వాహనాలలో గోవులను తీసుకువెళు తుండగా గుర్తించామని, వాటిని గోసాలకు తరలించామని తెలిపారు. అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులు అదుపులోకి తీసుకొని కేసులు. నమోదు చేస్తున్నామని, వాహనాలను సీజ్ చేస్తామన్నారు. గోవులను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



వాహనాన్ని సీజ్ చేసిన సిఐ

వెంకన్నను దర్శించుకున్న చాగంటి

ప్రజాశక్తి-నక్కపల్లి: ప్రముఖ ప్రవచనకారులు, ఆధ్యాత్మిక వేత్త చాగంటి కోటేశ్వరరావు గురువారం ఉదయం ఉపమాక వెంకన్న క్షేత్రాన్ని దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, భాగవతం సాయి గోపాల ఆచార్యులు ఆలయం మర్యాదలు, పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. స్వామిని చాగంటి దర్శించుకున్నారు.స్వామివారి శేష వస్త్రాన్ని చిత్రపటాన్ని చాగంటికి బహుకరించారు.ఉపమాక క్షేత్రాన్ని దర్శించుకోవడంతో ఇంద్రియాలను జయించే భాగ్యం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి సేవకులు నున్న సుభాష్, భగవాన్, గోర్స అప్పలాచారి, గురుభవానీ దవరసింగి రాంబాబు పాల్గొన్నారు.



చాగంటి కి వెంకన్న చిత్రపటాన్ని ఇస్తున్న ఆచార్యులు

జల జీవన్ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో గురువారం ఇంటింటికి కుళాయిలకు సంబంధించి జల జీవన్ మిషన్ పనులకు ప్రజా ప్రతినిధులు శంకుస్థాపన చేశారు. వార్డు సభ్యులు మైలపల్లి మహేష్ బాబు జలజీవన్ మిషన్ పనులు ప్రారంభించాలని కోరుతూ ఇటీవల అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు స్పందించి జల జీవన్ మిషన్ పనులు ప్రారంభానికి చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ మహేష్, వార్డు సభ్యులు పిక్కి కామేశ్వరరావు, మైలపల్లీ మహేష్‌బాబు, నాయకులు పిక్కి సత్తియ్య, అప్పలరాజు, మైలపల్లి సూరిబాబు, పిక్కి పైడితల్లి, బోందలపు అప్పలరాజు, కోడ కాశీరావు, కాశీ పాల్గొన్నారు .



శంకుస్థాపన చేస్తున్న ప్రజా ప్రతినిధులు



ఎన్నికైన నూతన సభ్యులు

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: నాతవరం మండలంలో శ్రీ సీతారామరాజు ఫోటోగ్రాఫర్, వీడియో గ్రాఫర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికైంది. అధ్యక్షులుగా గ్రంధి రవికుమార్, ఉపాధ్యక్షులుగా నందిక బుజ్జి, కార్యదర్శిగా నవీన్, ప్రధాన కార్యదర్శిగా కొండ్రపు లోవ, ట్రెజరరీగా బొత్స వెంకటరమణ ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు రవికుమార్ (రమేష్) మాట్లాడుతూ, ఫోటో, వీడియో గ్రాఫర్‌లను ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలో వివిధ గ్రామాల ఫోటో, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

బాధితురాలికి స్నేహాంజలి సాయం

ప్రజాశక్తి-కొత్తకోట: సమాజంలో సాధ్యమైనంత వరకు కష్టాలలో ఉన్న నిరుపేదల్ని అదుకోవడమే తమ లక్ష్యమని స్నేహాంజలి ఫర్ పూర్ ఆర్గనైజేషన్ సభ్యులు పూడి నాగేష్, గాధం కామరాజు అన్నారు. రావికమతం మండలం కొత్తకోట మట్టా వీధికి చెందిన బోగాది నాగమణి కుటుంబానికి రూ 10 వేల నగదు సాయాన్ని గురువారం సంస్థ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సదరు మహిళ నాగమణి గుండె జబ్బుతో బాధ పడుతుండగా ఆమె కుమారుడు వికలాంగుడు కావడంతో వీరి కుటుంబం పలు ఇబ్బందులు పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ సభ్యులు పూడి నల్లయ్య, బోగేష్ తదితరులు పాల్గొన్నారు.



సాయం అందజేస్తున్న సభ్యులు

అంగన్వాడీ భవనాలకు శంకుస్థాపన

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని నక్కపల్లి, వేదుళ్ళపాలెం, చినదొడ్డిగల్లు గ్రామాల్లో అంగన్వాడి కేంద్ర భవన నిర్మాణ పనులకు గురువారం ఎమ్మెల్యే బాబురావు శంకుస్థాపన చేశారు. భవన నిర్మాణ పనులకు సంబంధించి భూమి పూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రూ.48 లక్షల నిధులతో అంగన్వాడి కేంద్ర భవనాలను నిర్మించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపిపి రత్నం, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, మండల పరిషత్తు ఉపాధ్యక్షులు నానాజీ, ఈశ్వరరావు, సర్పంచ్‌లు, వైసిపి నాయకులు పాపారావు, శీరం నరసింహమూర్తి, శేషారత్నం ,భార్గవ్, బాబురావు, తాతారావు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

పాఠశాల ఏర్పాటు హామీ ఏమైంది : సిపిఎం

ప్రజాశక్తి-రోలుగుంట: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ రోలుగుంట మండలం అర్ల పంచాయతీ శివారు లోసింగి, పెద్ద గురువు, కొత్తలోసింగి గ్రామాలకు పాఠశాల ఏర్పాటు చేస్తానని రెండు నెలల క్రితం హామీ ఇచ్చారని, నేటికి ఆ హామీ నెరవేర్చలేదని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు విమర్శించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ నెలలో గుర్రంపై ఎక్కి మరీ గడపగడపకు కార్యక్రమానికి వెళ్లారన్నారు. ఆ మూడు గ్రామాల్లో పివిటిజి కోందు తెగకు చెందిన వారు 50మంది పిల్లలు ఉన్నారని, పాఠశాలకు పంపించాలంటే ఐదు కిలో మీటర్ల దూరం వెళ్లాల్సి వస్తుందన్నారు. దీంతో పాఠశాల ఏర్పాటు చేయాలని వారంతా ప్రాదేయ పడగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారన్నారు. పాఠశాలలు ప్రారంభించి నెల రోజులు దాటినా ఆ హామీ గాలికి వదిలేశారన్నారు.



మాట్లాడుతున్న గోవిందరావు



పరిశీలిస్తున్న పోలీసులు

తీర రక్షణకు ఏర్పాట్లు

ప్రజశక్తి-యస్.రాయవరం: తీరప్రాంత రక్షణలో తమవంతు పాత్రను పోషించేందుకు పోలీసులు కవాతును నిర్వహించారు. గడచిన రెండురోజులుగా మండలంలోని తీరప్రాంత గ్రామమైన రేవుపోలవరంలో నక్కపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నారాయణరావు నేతృత్వంలో స్థానిక పోలీసులు, మెరైన్ పోలీసులతో కలసి తీరప్రాంతంలో రక్షణ ఏర్పాట్లను పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న సాగర్ కవచ్‌లో భాగంగా తీర ప్రాంతంలో విధుల నిర్వహణపై సమగ్ర అవగాహన కల్పించారు.

సంక్షేమ పథకాలకు ప్రాధాన్యత

- ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు

ప్రజాశక్తి-మాడుగుల: సంక్షేమ పథకాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత కల్పిస్తుందని ఉప ముఖ్య మంత్రి బూడి ముత్యాల నాయుడు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం పొంగలిపాక పంచాయ తీలో నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. సంక్షేమ పథకాలతో ప్రజలు సంతృప్తిగా జీవనం సాగిస్తున్నారని అన్నారు. అమ్మబడి, రైతు భరోసా, ఆటో డ్రైవర్లకు చేయూత, ఈ బీసీ నేస్తం, అన్ని వర్గాలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం గ్రామాలలో పేద ప్రజలు ఆర్థికంగా ఉన్నత స్థితికి చేరుకోవడానికి వైసిపి ప్రభుత్వం పథకాలే కారణమని పేర్కొన్నారు. పొంగలిపాక పంచాయతీ పరిధిలో పలు సమస్యల పరిష్కారానికి అధికారులు ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. కాలువలు, రహదారుల నిర్మాణాలకు అవసరమైన నిధులు మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో వైసీపీ శ్రేణులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బూడి



నినాదాలు చేస్తున్న గిరిజనులు

గిరిజనుల వినూత్న నిరసన

ప్రజాశక్తి-కోటవురట్ల: అణుకు గ్రామానికి పాఠశాల, రోడ్డు సౌకర్యం కల్పించాలంటూ చేపట్టిన గిరి పుత్రుల రిలే నిరాహార దీక్షలు గురువారం 7వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా గిరి పుత్రులు గ్రామం నుండి డోలిమోస్తు.. ఇంకెన్నాళ్లీ డోలిమోత అని నినాదాలు చేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు అప్పలరాజు మాట్లాడుతూ, అణుకు గిరి పుత్రులకు రహదారి, పాఠశాల నిర్మించకపోవడం దారుణమని తెలిపారు. రోడ్డు సౌకర్యం లేక పోవడంతో అత్యవసర పరిస్థితులలో వైద్యం చేయించు కునేందుకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని, విద్యార్థులు చదువుకునేందుకు కాలినడకన రావాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి స్పష్టమైన హామీ ఇచ్చి పాఠశాల, రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ఎం సత్యనారాయణ, గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు, జనసేన పార్టీ నాయకులు ఉగ్గిన రాము, సిపిఎం మండల నాయకులు డేవిడ్‌రాజు, ఎం.రాజబాబు, టి కొండబాబు, రమేషు, రఘు బాబు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎంపిపి


డ్వాక్రా మహిళలకు మొక్కల పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ: గ్రీన్ మిలీనియం కార్యక్రమంలో భాగంగా డ్వాక్రా మహిళలకు ఎంపిపి గజ్జలపు మణికుమారి, మండల పార్టీ అధ్యక్షుడు లెక్కలు సత్యనారాయణ మొక్కలను పంపిణీ చేశారు. మొదటి విడతలో 15 వేల మొక్కలు పంపిణీ చేపడుతు న్నామన్నారు. మహిళలే నిధిని సమకూర్చి మొక్కలను కొనుగోలు చేసుకున్నారని ఏపిఎం మంగ తెలిపారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



ఆదిత్య, బిందు, లహరి



సత్యపావని, వెంకట దుర్గ

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని ఐదుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకు ఎంపికైనట్లు ఎంఈఓ కె నరేష్ తెలిపారు. గురువారం ప్రభుత్వం విడుదల చేసిన ట్రిపుల్ ఐటీ ఫలితాల జాబితాలో గొడిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ముగ్గురు, నక్కపల్లి బాలికల ఉన్నత పాఠశాల నుండి ఇద్దరు విద్యార్థులు ఎంపిక అయ్యారని తెలిపారు. గొడిచర్ల ఉన్నత పాఠశాల నుండి ఎన్.వెంకట దుర్గ 580, కర్రి లహరి 576, జక్కా ఆదిత్య 564 మార్కులతో ఎంపిక కాగా, నక్కపల్లి బాలికోన్నత పాఠశాల నుండి బి.సత్యపావని 575, గుతకాల బిందు 566 మార్కులతో ఎంపికయ్యారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థులను ఎంఈఓ నరేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, రామ ప్రతాప్, సుందరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

వీనస్ విద్యార్థుల ప్రతిభ

మాడుగుల: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక విశ్వ విద్యాలయం ట్రిపుల్ ఐటీలో ప్రవేశ పరీక్ష రాసిన బర్ల జయదేవ్ నూజివీడు త్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు ఎంపిక కాగా, కోన కావ్య శ్రీ శ్రీకాకుళం త్రిపుల్ ఐటి క్యాంపస్‌కు ఎంపికయ్యారు. ఈ విద్యార్థులు మాడుగుల వీణస్ కోచింగ్ సెంటర్ తాళ్లపరెడ్డి నాగచంద్ర వద్ద శిక్షణ పొందారు. గత అనేక సంవత్సరాలుగా ప్రతి ఏడాది వివిధ ప్రవేశ పరీక్షలలో వీనస్ కోచింగ్ సెంటర్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు మెరుగైన ఫలితాలు రాణిస్తూ ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారు. ఈ సందర్భంగా తాలపురెడ్డి నాగచంద్రకు పలువురు అభినందనలు తెలిపారు.



జయదేవ్, కోన కావ్య

రావికమతం : మరుపాక ఆదర్శ పాఠశాల నుంచి త్రిపుల్ ఐటీఐకు ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కె.సత్య సునీల్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, పాఠశాలకు చెందిన ద్వారపూడి తరుణ్ కుమార్ 578, తూరుబిల్లి హరిత 575, నూజివీడు త్రిబుల్ ఐటీలోనూ, సాసబిల్లి స్వర్ణకుమారి 566, దొడ్డి యశ్వంత్ 567, కాశెట్టి హేమసాగర్ 565 మార్కులు సాదించి శ్రీకాకుళం త్రిపుల్ ఐటీఐకు ఎంపికయ్యారని ఆయన తెలిపారు.



హరిత, హేమశేఖర్, కుమారి, కుమార్, యశ్వంత్

ఆనందపురం : మండలంలోని లొడగలవానిపాలెం పంచాయతీ నేలతేరిలోని కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థులు నూజివీడు త్రిబుల్ ఐటికి ఎంపికైనట్లు పాఠశాల ప్రత్యేకాధికారి చంద్రకళ తెలిపారు. పదవ తరగతి పరీక్షలలో ఎన్.భారతి 588 మార్కులు, ఇ.రేవతి 585 మార్కులు సాధించి త్రిబుల్ ఐటిలో సీట్లు సాధించారని పేర్కొన్నారు. ఇద్దరు విద్యార్థినులను చంద్రకళ, సిబ్బంది అభినందించారు.

గొట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివి 566 మార్కులు సాధించిన కోట్ల హారిత శ్రీకాకుళంలోని త్రిబుల్ ఐటికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రుత్తల సన్యాసిరావు తెలిపారు.



రేవతి, హరిత, భారతి

హ్యాండ్‌లూమ్ ఉత్పత్తులకు ఆదరణ



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మేయర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : భారతీయ సంస్కృతిలో సిల్క్, హ్యాండ్‌లూమ్ వస్త్రోత్పత్తులకు ఎంతో ఆదరణ ఉందని జివిఎంసి మేయర్ గొలగాని హరి వెంకట కుమారి అన్నారు. బీచ్ రోడ్డులోగల ద గేట్ వేలో ఏర్పాటైన కృతి వీవ్స్ అండ్ క్రాఫ్ట్స్ హ్యాండ్‌లూమ్ వస్త్ర ప్రదర్శనను ఆమె గురువారం ప్రారంభించారు. గౌరవ అతిథులుగా డిఐసి జనరల్ మేనేజర్ గణపతి, ఖాదీ విలేజీ ఇండస్ట్రీస్ బోర్డు డిప్యూటీ డైరెక్టర్ పద్మజ హాజరయ్యారు. మేయర్ హరి వెంకట కుమారి, పద్మజ వస్త్ర ప్రదర్శనలోని ఉత్పత్తుల గొప్పతనాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ హ్యాండ్లూమ్ ఉత్పత్తులకు నేటికీ వన్నె తగ్గలేదన్నారు. ఉత్పత్తుల తయారీ వెనుక చేనేతకారుల శ్రమ ఎంతో దాగి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ చేనేతను ఆదరించాలని, అప్పుడే చేనేతకారుల కష్టానికి తగ్గ ఫలితం దక్కుతుందని అన్నారు. నేటి తరం యువతలోనూ హ్యాండ్ లూమ్ ఉత్పత్తుల పట్ల ఆదరణ ఉందన్నారు. నిర్వాహకులు యలమంచిలి శ్రీలత మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీ వరకూ కొనసాగే ఈ ప్రదర్శనకు దేశంలోని 14 నగరాల నుంచి చేనేతకారులు, చేతి పని బృందాలు వారు తరలివచ్చారన్నారు. వారి సిల్క్ హ్యాండ్‌లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్స్ సహా 50 వేల రకాల వస్త్రోత్పత్తులను అందుబాటులో ఉంచారని వివరించారు.

17న హ్యాండ్‌బాల్ అకాడమీ రాష్ట్ర స్థాయి ఎంపికలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ విజయవాడ హ్యాండ్‌బాల్ (బాలురు) అకాడమీలో అడ్మిషన్ కోసం 14 నుంచి 18 సంవత్సరాల వయస్సుగల హ్యాండ్‌బాల్ క్రీడాకారులకు తెనాలిలోని మినీ స్టేడియంలో ఈ నెల 17న ఉదయం 8 గంటలకు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ (బాలురు) ఎంపికలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ముఖ్య క్రీడా శిక్షకులు జున్ గ్యాలియెట్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్ నిర్వహించిన సబ్-జూనియర్, జూనియర్ నేషనల్ ఛాంపియన్‌షిప్‌లో మొదటి నాలుగు స్థానాలు, ఇంటర్ జోనల్, ఇంటర్-యూనివర్సిటీ ఛాంపియన్‌షిప్‌లలో మొదటి రెండు స్థానాలు పొందిన జట్లు సభ్యులలో ఎవరైనా ఎంపికలకు హాజరయ్యేందుకు అర్హులని పేర్కొన్నారు. గుర్తింపు పొందిన రాష్ట్ర క్రీడా సంఘం నిర్వహించిన రాష్ట్ర ఛాంపియన్ షిప్‌లలో 1, 2 స్థానాలు పొందిన జట్టు సభ్యునిగా ఉండాలని తెలిపారు. భారత ప్రభుత్వం అధికారికంగా పంపిన ఏదైనా గుర్తింపు పొందిన ఛాంపియన్‌షిప్, టోర్నమెంట్‌లలో సబ్-జూనియర్, జూనియర్ జట్టు సభ్యునిగా భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారుడు, రాష్ట్ర ఛాంపియన్‌షిప్, ఖేలో ఇండియా నేషనల్ స్కూల్ గేమ్స్ టీమ్‌లలో విజేత, రన్నరప్ సభ్యుడు, రాష్ట్ర క్రీడా సంఘాలు, రాష్ట్ర క్రీడా మండలి, రాష్ట్ర క్రీడల శాఖ నిర్వహించిన గుర్తింపు పొందిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు ఎంపికల్లో పాల్గొనేందుకు అర్హులని వెల్లడించారు. ఆంత్రోపోమెట్రిక్ పరీక్షలు వంటి పనితీరు సూచికల ఆధారంగా, వయస్సు, క్రీడ, విభాగం తదితరాలను పరిశీలించి ఎంపికలు ఉంటాయన్నారు. అంతేగాకుండా ఎవరైనా క్రీడాకారులు (బాలురు) పొడుగ్గా, బలంగా, అసాధారణ లక్షణాలు కలిగి ఉంటే వారిని నేరుగా రాష్ట్ర స్థాయి ఎంపిక కోసం కూడా పరిగణిస్తారన్నారు. ఈ నేపథ్యంలో అర్హులైన క్రీడాకారులందరూ ఎంపిక ప్రక్రియ జరుగు ప్రదేశానికి ఆ రోజు ఉదయం 8 గంటలకు ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, ఐదు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, సివిల్ సర్జన్ డాక్టర్ నిర్ధారించిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలలో పొందిన సర్టిఫికెట్లుతో రావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7842829449 నెంబరును సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

పవన్ వ్యాఖ్యలపై వాలంటీర్ల ధర్నా

ప్రజాశక్తి-గొలుగొండ: వలంటీర్లపై పవన్‌కళ్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరశిస్తూ గురువారం గొలుగొండ మండలం ఏఎల్‌పురంలో వాలంటీర్లు ధర్నా చేపట్టారు. వీరంతా గ్రామ సచివాలయం నుండి ప్లకార్డులు చేతబట్టి నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. అనంతరం శరభన్నపాలెం జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించి పవన్‌కళ్యాణ్ తక్షణమే వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎల్‌పురం, సిహెచ్.నాగాపురం, పాతకేడిపేట గ్రామాల వలంటీర్లు పాల్గొన్నారు.



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వాలంటీర్లు